
ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జనవరి 04, 2015
'రోబో' సేవకులు వచ్చేస్తున్నారు !
నవ్వుల్ నవ్వుల్
పువ్వుల్ పువ్వుల్

కామెడీ హీరోలు

'అవకాశం' అనేది పొద్దస్తమానం రాదు. కాకపోతే వచ్చినప్పుడు మాత్రం విడిచిపెట్టకుండా నిరూపించుకోవాలి. వెండి తెర మీద నాలుగు జోకులు చెప్పి నవిస్తూ, కవిస్తూ ఆకట్టుకునే తారలు వీళ్లు. తమ నవ్వులతో ప్రేక్షకులకు బాగా దగ్గరైన హాస్య నటులతోనే సినిమా తీస్తే.....ఈ ఆలోచన దర్శక మహాశయుల మెదడులో మెరిస్తే...... వీళ్లే హీరోలు. ఇక ధియేటర్లలో ఆ రెండు గంటలూ నవ్వులే నవ్వులు. అలీ, సునీల్, వేణు మాధవ్, కృష్ణ భగవాన్, ధనరాజ్, శ్రీనివాస రెడ్డి, తాగుబోతు రమేష్ ... వీరంతా ప్రేక్షకులను కబుపుబ్బా నవ్వించే కామెడీ పాత్రలేకాదు, కథా నాయకులుగానూ నటించారు. వాటిని మనం చూసేశాం కూడా . అంటే వీరు నవ్వుల్ని మాత్రమే కాదు...నవ రసాల్ని పండించగలరన్న మాట. నవ్వుల దినోత్సవం సందర్భంగా వీరు పంచిన "నవ్వులను" గుర్తుచేసుకోడానికే ఈ చిన్ని ప్రయాస !



ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

వేగం వెర్రి

కోటి ఆశలతో... కొత్త సంవత్సరంలోకి అడుగెట్టి... ముచ్చటగా మూడు రోజులు గడిచిపోయాయి. నూతన సంవత్సర ప్రయాణంలో ఎవరి గమ్యాలు వారివి. ఎవరి వేగం వారిది. నిజానికి ప్రయాణమంటేనే... వేగం...గమ్యం... సమయాల కలయిక. మనం ఎంచుకున్న గమ్యాన్ని చేరుకోడానికి నిర్దేశించుకున్న సమయానికి అనుకూలంగా వేగాన్ని నిర్ణయించు కుంటుంటాం. వేగం జీవన వేదంగా మారింది మరి.

ఆటల్లో, ఉద్యోగాల్లో రాణించాలంటే వేగం ప్రధానం. వేగం లోపిస్తే ఓటమే! అందుకే ఒలింపిక్ క్రీడల నినాదంలో 'మరింత వేగంగా...మరింత దృఢంగా...' అన్న పదాలను ఏర్పాటు చేసుకున్నారు. కొలువు కోరి వెళ్లినప్పుడు మన వేగాన్ని కీలక ప్రమాణంగా తీసుకోవడం కద్దు.

నేర పరిశోధకుల మెదడు ఎంత చురుగ్గా... ఎంత వేగంగా వుంటే...అంత త్వరితంగా చిక్కుముడులు విడదీయగలుగుతారు. కేసులు పరిష్కరించగలుగుతారు.

'రియల్' కట్టడాలు, సినీ నిర్మాణాలు... వేగంగా జరిగితేనే ధనలక్ష్మి కటాక్షిస్తుంది. వేగం ఏమాత్రం మందగించినా మొదటికే మోసం.

తుఫానులు, భారీ వర్షాలు, భూకంపాలు... వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సహాయక చర్యలు వేగంగా అందితే నష్టం తక్కువగా వుంటుంది. నత్త నడకన సాగితే అంతే సంగతులు. ప్రజా సౌకర్యాల కల్పన వేగంగానే జరగాలి.

రాష్ట్ర నూతన రాజధాని నిర్మాణ పనులు సైతం వేగంగా చేపడతామంటున్నారు సీఎం గారు. మంచి నిర్ణయమే! అయితే ఆ వేగం వెర్రిలో పడి రైతులకు అన్యాయం జరక్కుండా చూస్కోవాలి.

ర్యాంకు కొట్టాలంటే పరుగుల వేగం పెంచమని చిన్నారులను పోరుతుంటారు పెద్దలు. అలవిగాని వేగం అందుకోవడానికి ఆ పసి హృదయాలు పడే వేదనను అర్థంచేసుకోరెందుకో!

వేగం మోజులో పడో, వేగంగా గమ్యాలను చేరుకోవాలన్న తపనతోనో వాయువేగంతో వాహనాలను నడిపి తిరిగిరాని లోకాలకు చేరుకుటుంటారు. పోయిన వాళ్లు 'బానే' వున్నా... అయినవారికే అంతులేని శోకం.

అయితే... వేగానికీ హద్దులు...సరిహద్దులు వుంటాయ్! పసివాడైనా, కుర్రోడైనా, వృద్ధుడైనా, ఉద్యోగార్థి అయినా... ప్రతి ఒక్కరికీ తమదైన వేగం వుంటుంది. దాన్ని మించిన వేగంతో పరుగెడితేనే! లేనిపోని సమస్యలు!!

కానీ... వేగానికి విచక్షణ జత చేస్తే... వరించదా! విజయం!! ■

◆ మనలో మాట

టపా

కథనం బాగుంది!

21 డిసెంబర్ 2014 స్నేహలో ప్రచురితమైన హాస్యానికే చిరునామా చార్లీ చాప్లిన్ కథనం బాగుంది. చాప్లిన్ పేరు వినగానే ....వదులైన సంచుల్లాంటి పంట్లాం. ఇరుకైన కోటు, పాదాలకు మించిన పెద్ద బూట్లు, నెత్తిన చిన్న టోపీ ఫ్రెంచ్ కట్ మీసాలు...అంటూ వర్ణించిన తీరు ప్రత్యేకంగా ఆకట్టుకుంది. జీవితంలో ఎన్నో కష్టాలు పడ్డ చార్లీ చివరికి కోట్లకు పడగ లెత్తినా...ఆయన చిత్రాలన్నీ కార్మికుల కష్టాలు, వ్యవస్థ చేసే దోపిడీ గురించే ఉంటుంది. అలాంటి గొప్ప వ్యక్తిని స్మరించుకోవడం చాలా అవసరం. స్నేహలో ఇంకా ఇలాంటి గొప్ప వ్యక్తుల గురించిన కథనాలు రావాలని ఆశిస్తున్నాం.

- టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖపట్నం.

'కార్పొరేట్' కుయుక్తులు

మనలో మాట' లో ప్రచురించిన బదిలీ(ల)లు చాలా బాగుంది. సమకాలీన అంశాలను వ్యంగ్యంతో పాఠకుడికి అర్థమయ్యేలా రాయడం ప్రత్యేకంగా అనిపించింది. చూద్దామాలో 'భారీ బౌద్ధాలయం బోరో బుదొర్' గురించి ఆసక్తికరమైన అంశాల గురించి చెప్పారు. అయితే ఈ ఆలయానికి సంబంధించి మరికొన్ని ఫోటోలు ఇస్తే బాగుండేది. రాధకు నీవేరా ప్రాణం కథ ఫర్వాలేదు. హిందీ చలన చిత్ర నేపథ్యగాన చరిత్రలో కొత్త ఒరవడి సృష్టించిన...మర్చిపోలేని సుస్వరం మహమ్మద్ రఫీ ని ఆయన జయంతి సందర్భంగా గుర్తుచేయడం సంగీత ప్రియులకు మీరందించిన ఆబాలగోపాలమే అని చెప్పవచ్చు. చార్లీ చాప్లిన్ గురించి రాసిన కథనం కూడా బాగుంది. క్రేజీలో 'దొంగ దొంగ' శీర్షికలో ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఏడు చోరీల గురించి ఇచ్చిన కథనం చదువుతుంటే ఆసక్తిగా అనిపించింది. నవ్వు తెప్పించింది. వివిధ దేశాల్లో క్రిస్మస్ వేడుకలు ఎలా జరుపుకుంటారో చెప్పిన సమాచారం బాగుంది. సమ్‌థింగ్ స్పెషల్ కూడా స్పెషల్‌గా అనిపిస్తుంది. అంతర్జాతీయ స్థాయి విషయాలను మీరు తీసుకోవడం చాలా బాగుంది. ముఖ్యంగా పెట్టుబడిపై 760 రెట్ల ఆదాయం కథనం చదువుతుంటే విరాళాలపేరుతో వసూలు చేసి, కార్పొరేట్ కంపెనీలు ఎలా లబ్దిపొందుతున్నాయో వివరించారు. ఈ అంశం ఆకట్టుకుంది. వాల్‌మార్ట్ కంపెనీ సిబ్బందికి వేతనాలు తక్కువ ఇచ్చి, హుండీలు పెట్టి వారికోసం విరాళాలు సేకరించడం గురించి చదువుతుంటే కార్పొరేట్ కుయుక్తులు ఎలా ఉంటాయో అర్థమయింది. ప్రజలు తెలుసుకోవాల్సిన విషయాలనే మీరు ఇస్తున్నారు. అభినందనీయం.

- బి. జ్యోతి, నెల్లూరు

అట్టమీది కథ ఆకట్టుకుంది

డిసెంబర్ 21 సంచికలో వివిధ దేశాల్లో మెర్రీ క్రిస్మస్ అట్టమీది కథ మమ్మల్ని ఆకట్టుకుంది. జర్మనీలో క్రిస్మస్ మార్కెట్ సందడి గురించి, లండన్‌లో నెల ముందు నుండే మొదలయ్యే క్రిస్మస్ వేడుకల గురించి చక్కగా వివరించారు. బ్రెజిల్‌లోని భారీ క్రిస్మస్ చెట్టు గురించి ఇచ్చిన వివరాలు కూడా ఆసక్తిగా అనిపించాయి. శాంతా క్లాజ్ గురించి , ప్రత్యేకంగా క్రిస్మస్ సంగీతం గురించి మీరిచ్చిన వివరాలు బాగున్నాయి. రుచిలో క్రిస్మస్ సందర్భంగా చేసుకునే రకరకాల కేకులు గురించి ఇచ్చారు. యాపిల్ కేకు, కాజు మఫిన్ కేకు తయారీ కొత్తగా అనిపించింది. 'బాల నేస్తాలు'లో నిజమైన స్నేహం చిట్టికథ బాగుంది. అందులో చీమ, పావురం స్నేహం, మనం ఇతరులకు సాయం చేస్తే మనకు ఎవరైనా సహాయం చేస్తారు అన్న ముగింపు చాలా స్ఫూర్తి దాయకంగా ఉంది. పిల్లలే కాదు పెద్దలు కూడా ఈ విషయాలు తెలుసుకుంటే బాగుంటుందని నా అభిప్రాయం.

- ఎమ్. సుభద్ర, గన్నవరం, కృష్ణా జిల్లా

ఈ సంచికలో....

నవ్వుల్ నవ్వుల్.. పువ్వుల్ పువ్వుల్..

కవర్‌స్టోరీ 14

పాత ఏడాదికి నవ్వుతూ వీడ్కోలు పలికాం. కొత్త ఏడాదికి నవ్వుతూ స్వాగతం పలికాం. అంతేనా... ప్రతి రోజునూ నవ్వుతూ గడుపుదాం! అప్పుడు జీవితమంతా నవ్వుల మయమే. ఆక్సిజన్ మనిషికి ప్రాణాధారం కావచ్చు కానీ నవ్వు అంత కన్నా ఎక్కువ. అందుకే...365 రోజులూ నవ్వండి! హాయిగా నవ్వండి! మనసారా నవ్వండి!

సందర్భం 3
ఇప్పటికీ ఆకట్టుకునే స్వర్ణోత్సవ చిత్రం ..... ఆత్మ బలం

చూద్దామా 4
అక్కడ రాత్రి పది గంటలకు 'సూర్యాస్తమయం'

కథ 6
అమ్మ

టెక్ గురు 8
'రోబో' సేవకులు వచ్చేస్తున్నారు!

సినిమా కబుర్లు 10
ఆ మాట నన్ను కాపాడింది

నవ్వుల్ - పువ్వుల్ 11

సీరియల్ 18
ప్రేమ విప్లవం

రుచి 21
భలే భలే.... బజ్జీలు

బాలనేస్తాలు 22
మమ్మీ లోపలికి దారేది?

సమ్‌థింగ్ స్పెషల్ 24
పేరుకే క్లీన్ ఎనర్జీ... ఆచరణలో కాలుష్యమే

నవ్వించే... చదివించే 'కామిక్' కథానాయకులు

12

◆ సందర్భం

ఆత్మ బలం చిత్రం 1964 జనవరి9న విడుదలైంది. ఈ సినిమా అప్పట్లో ఓ సంచలనం. వి.బి.రాజేంద్ర ప్రసాద్ స్థాపించిన జగపతి ఆర్ట్ పిక్చర్స్ సంస్థకి విక్టరీ చిత్రమై, వి. మధుసూధన రావు దర్శకత్వ ప్రతిభకు ఓ గీటు రాయిగా నిలిచింది. హీరో అక్కినేనికి ఓ తీపి జ్ఞాపకమైంది. హీరోయిన్ బి. సరోజాదేవికి మరిచిపోలేని విజయమైంది. ఐదు దశాబ్దాల కిందట విడుదలైనా ఇప్పుడు కూడా చెప్పుకోదగిన చిత్రంగా మిగిలిన నవనవోన్మేష చిత్రం 'ఆత్మ బలం' పై ప్రత్యేక కథనం..........

ఇప్పటికీ ఆకట్టుకునే స్వర్ణోత్సవ చిత్రం

ఆత్మబలం

'అగ్ని సంస్కార్' అనే బెంగాలీ నవల ఆధారంగా అల్లుకున్న చక్కని కథకి ఆచార్య ఆత్రేయ రాసిన మాటలు, పాటలు అద్భుతంగా అమరాయి. కె.వి మహదేవన్ సంగీతం సమకూర్చిన ఈ చిత్రంలోని పాటలన్నీ ప్రేక్షకులను హాయిగా ఆకట్టుకుంటాయి,. నేపథ్యసంగీతం కూడా వీనుల విందుగా స్వరపరచడంలో సంగీత దర్శకుని ప్రతిభ మనకు కనబడుతుంది. ఇప్పటికీ ఈ సినిమా చూస్తే కథ, కథనం, ఫోటోగ్రఫీ కట్టిపడేస్తాయనడంలో ఏమాత్రం సందేహం లేదు.

ఈ చిత్ర కథ ఓ పదేళ్ల పిల్లాడి మానసిక సమస్యతో మొదలవుతుంది. ఎందుచేత నంటే తండ్రి చనిపోవడాన్ని కళ్లారా చూసిన అతడిలోని మానసిక వైకల్యమే కథని మలుపు తిప్పేది కాబట్టి. ఆ పిల్లాడే పెరిగి పెద్దవాడై జగ్గయ్యగామారి, హీరో,హీరోయిన్లనీ వాళ్ల ప్రేమనీ ముప్పుతిప్పలు పెడతాడు. హీరో ఉరికంబం ఎక్కడానికి కారకుడవుతాడు. హీరో ఉరిశిక్షకి వెళుతున్న దృశ్యాలు, మరోవైపు అతడిని కాపాడే ప్రయత్నాల మధ్య చిత్రం క్లైమాక్స్ రక్తికట్టడానికి దోహదపడతాడు. ఆ పిల్లాడి తల్లి కన్నాంబకి ఓ మిల్లు ఉంటుంది. అందులో ఇంజనీరే హీరో గారు. అతడు కారులో ఉద్యోగానికి వెళుతుంటే హీరోయిన్ పరిచయమై ప్రేమకు నాంది పలుకుతుంది. ఆ తరువాత ఇద్దరూ చిటపటచినుకులు పడుతూ ఉంటే ......

చెప్పలేని ఆహాయి... ఎంత వెచ్చగా ఉంటుందోతెలుసుకునే సరికి ప్రేమలో తడిసిముద్దయిపోతారు. ఇలా వీళ్ల డ్యూయెట్లమీద డ్యూయెట్లు పాడుకుని ప్రేక్షకులను ఉర్రూత లూగిస్తుంటే, మానసిక

వైద్యశాలలో చికిత్స పొందుతున్న జగ్గయ్య కథను మలుపు తిప్పడానికి పారిపోతాడు.

మిల్లు యజమానురాలి కోరికపై హీరో అతడిని ఇంటికి తీసుకొస్తే, అమ్మతో హీరోయిన్‌ని పెళ్లాడతానని చెప్పే సరికి ప్రేమికులతో పాటు ప్రేక్షకుల మనసులూ కలుక్కుమంటాయి. చిన్ననాటి నుండి పెంచిపోషించిన కన్నాంబ కోసం అవసరమైతే ఎంతటి త్యాగాన్నైనా చెయ్యాలని చెప్పి చనిపోయిన తన తల్లి మాటలు హీరోయిన్‌ని కట్టిపడేస్తాయి. హీరో కూడా త్యాగాన్నే బోధించి వెళ్లిపోవడంతో ఆమె విషాదంలో మునిగిపోతుంది. ఆ తరువాత వీళ్లిద్దరి ప్రేమను గురించి చెప్పుడు మాటలు విన్న జగ్గయ్య అనుమానపడడం. దేనికైనా తెగించే మనస్తత్వం ఉన్న అతడి బారినుండి ప్రాణాలు కాపాడుకోవడానికి హీరోయిన్ ఇంట్లో నుండి పారిపోయి చివరకు హీరోను చేరుకోవడం లాంటి సంఘటనలతో కథ చిక్కనై పాకానపడుతుంది.

జగ్గయ్య పిచ్చి ముదిరి పరాకాష్టకు చేరుకుంటుంది. దాంతో తాను ఆత్మహత్య చేసుకుంటూ, తనను హీరోనే హత్యచేసినట్లు నమ్మేవిధంగా పరిస్థితులు కల్పించి చనిపోతాడు. సాక్ష్యాలన్నీ కలిసి హీరోను ఉరికంబానికి, చిత్రాన్ని క్లైమాక్స్‌కి తీసుకువెళతాయి. హీరోకి ఉరితాడు తగిలించేలోగా ఆఘమేఘాలమీద రేలంగి, హీరోయిన్‌లు జగ్గయ్య రాసుకున్న డైరీ తీసుకొచ్చేసరికి అందులోని అంశాలను బట్టి, చిట్టచివరి నిమిషంలో న్యాయమూర్తి నిజం గ్రహించి ఉరిశిక్షను రద్దు చేయడంతో కథ సుఖాంతమవుతుంది.

అయిదు దశాబ్దాల తరువాత కూడా ఈ చిత్రాన్ని గురించి మనం ప్రస్తావించుకోవడానికి ప్రధాన కారణం బలమైన కథ, స్క్రీన్ ప్లే, ఉత్తమ సాంకేతిక విలువలతో పాటు వీనులవిందైన పాటలు, మాటలు ముఖ్యంగా ప్రేక్షకులను ఆకట్టుకునే శైలితో దర్శకత్వం ఉండడమే ! జగపతి సంస్థ ప్రతిష్టను పెంచిన ఉత్తమ స్వర్ణోత్సవ చిత్రం 'ఆత్మ బలం'

- కె.వి. నాగేశ్వరరావు

అక్కడ రాత్రి 10 గంటలకు సూర్యాస్తమయం



జీవితంలో కొన్ని అనుకోని అవకాశాలు మన జీవన గమనాన్నే మార్చేస్తాయి. అలా వచ్చిన అవకాశమే పోలాండ్‌లో మేనేజర్ ఉద్యోగం. పోలాండ్ యూరోపియన్ యూనియన్‌లో భాగం కావడంతో నేను అక్కడ పనిచేసిన కాలంలో జర్మనీ, స్వీడన్, ఇటలీ, లిచ్చేన్ స్టెయిన్, ఆస్ట్రియా,స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, బెల్జియం, నెదర్లాండ్స్, చెక్ రిపబ్లిక్ దేశాల్లో పర్యటించాను. అక్కడి రాజకీయ, చారిత్రిక, అంశాల మీద లోతుగా అధ్యయనం చేసే అవకాశం దక్కింది. హిట్లర్ అంటే చిరంజీవి నటించిన ఒక సినిమా అని మాత్రమే తెలిసిన నాకు అసలు ఆ పదం ఈ యుగంలోనే స్మరించరానిది అని అర్థం అయింది. యుద్ధాన్ని ఒక దైనందిన కార్యక్రమంలా చేస్తూ, మనుషుల్ని చంపటానికి ఫ్యాక్టరీలు పెట్టి మరీ నరమేధానికి పాల్పడిన హిట్లర్ దాష్టికాలకు నాంది పోలాండ్ దేశం. ఆ దేశంతో నా అనుభవాలు.........

మే 4, 2012 ...హైదరాబాద్ నుండి పోలాండ్‌కు నేరుగా విమాన సౌకర్యం లేకపోవడంతో ఖతర్ వెళ్లాను. ఖతర్ మధ్య ప్రాచ్యంలో ఉన్న అత్యంత సంపన్న దేశం. ఇక్కడ ప్రతి 1000మందిలో 147మంది కోటీశ్వరులేనట. మన సమయానికి ఖతర్ గంటన్నర వెనకుంటుంది. అక్కడ విమానాశ్రయం చాలా పెద్దది. దాదాపు ప్రపంచంలోని అన్ని దేశాలకి ఇక్కడి నుండి విమానాలుంటాయి. ఆసియా దేశాల నుండి అమెరికా, యూరప్, ఆఫ్రికా దేశాలకి వెళ్లే ప్రయాణికులకి ఇది జంక్షన్. ఖతర్ నుండి వేరే విమానంలో ఫ్రాంక్ ఫర్ట్ వెళ్లాలి నేను. జర్మనీలో ఉన్న ఒకానొక పెద్ద నగరమిది. ఫ్రాంక్ ఫర్ట్‌లో విమానం దిగి అక్కడి నుండి పోలాండ్ దేశీయ విమాన సంస్థ అయిన లాట్ పోలిష్ ఎయిర్వేస్ విమానంలో పోలాండ్‌లో ఉన్న 'పోజ్ నాన్' అనే పట్టణం చేరుకోవాలి. పోలాండ్ రాజధాని వార్సా. వార్సాకి 500 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది పోజ్నాన్. ఈ పట్టణం బహుశా మన విజయవాడ అంత ఉంటుందేమో. అక్కడ విమానశ్రయం మరీ చిన్నదేమీ కాదు. ఐరోపాలోని అన్ని దేశాలకి పోజ్నాన్ నుండి విమానాలున్నాయి. మన కంటే పోలాండ్ కాలమానం మూడున్నర గంటలు వెనుక. ఇమ్మిగ్రేషన్ చెకింగ్‌లు అన్నీ సవ్యంగా జరగటంతో అనుకున్న సమయానికే చేరుకున్నాను. నా నివాసం మాత్రం పోజ్నాన్‌కు సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉండే మింజు జెర్జ్ అనే చిన్న పట్టణంలో. నేను వెళ్లింది మే నెల అయినా ఆ రోజు ఉష్ణోగ్రత 5 డిగ్రీలు. ఎముకలు కొరికే చలి. అక్కడ రోడ్లన్నీ ఎంత అందంగా ఉన్నాయంటే , అద్దంలా వాడుకుని తల దువ్వుకోవచ్చు అనిపించింది. ఎటు చూసినా పచ్చటి నేల. పోలాండ్‌లో ఉన్న ప్రకృతి రమణీయత మాత్రం నేను పర్యటించిన మిగతా దేశాల్లో ఎక్కడా చూడలేదు. ఇక్కడ వ్యవసాయం మే నుండి సెప్టెంబర్ వరకు మాత్రమే అనువైన సమయం. మిగతా నెలలన్నీ మంచుతో కప్పబడి ఉండటంతో వ్యవసాయానికి అనుకూలం కాదు. ఇక్కడ మనలాగా రెండు ఎకరాలు, మూడు ఎకరాలు సాగుచేయరు. ఒకే రైతు సుమారు కొన్ని వందల ఎకరాలను సాగు చేస్తాడు. పోలాండ్ ప్రజల భాష పోలిష్. యూరప్ అన్ని దేశాల్లో స్థానిక భాషలదే హవా. కంప్యూటర్లు, సైన్ బోర్డులు, ప్రభుత్వ ప్రకటనలు అన్నీ స్థానిక భాషల్లోనే కనిపిస్తాయి. రాత్రి 10 గంటలకి కాని సూర్యాస్తమయం ఉండదు. ఇండిపెండెంట్ ఇళ్లు అన్ని విసిరేసినట్లు అక్కడొకటి, అక్కడొక్కటి ఉన్నా అపార్ట్‌మెంట్‌లు మాత్రం సమూహంలానే ఉంటాయి. అలాంటి ఓ అపార్ట్‌మెంట్‌లోనే నా నివాసం.

ఆష్విట్జ్ మ్యూజియం

మింజు జెర్జ్ పట్టణ జనాభా సుమారు 20,000 వుంటుంది. మింజు జెర్జ్ అంటే పోలిష్ భాషలో రెండు నదుల మధ్య ఉండే ప్రాంతం అని అర్థం. ఓబ్రా, పాక్లిసా అనే రెండు నదులు పట్టణానికి ఇరువైపులా ప్రవహిస్తుంటాయి. ఇక్కడి నుండి జర్మనీ రాజధాని బెర్లిన్ 150 కిలోమీటర్లు మాత్రమే. పోలిష్‌లో హాయ్ చెప్పాలంటే చేష్, థాంక్యూ అంటే జిన్కుయా, గుడ్ మార్నింగ్ అంటే జిందాబ్రే....పోలీస్ భాష చాలా కష్టంగానే ఉంటుందని నా భావన. ఆ పదాలు పలకాలంటే నోటికి కాస్త పని పెట్టాల్సిందే. ఇక్కడ స్థానిక సంస్థలు చాలా సమర్థవంతంగా పనిచేస్తాయి. ఇక్కడ ప్రతి ఊరికి ఒక టౌన్ హాల్, కూడలి తప్పనిసరిగా ఉంటాయి. అభివృద్ధి అంతా స్థానిక మేయర్లు, ప్రజా ప్రతినిధుల చొరవతోనే జరుగుతుంది. పట్టణ మేయర్ ఒక సామాన్య వక్తిలాగే నివసిస్తాడు. ఎటువంటి, హంగులు, ఆర్భాటాలు ఉండవు. ఇక్కడి ప్రజల ఆహారం బ్రెడ్, మాంసం(చికెన్, పోర్క్). పోలాండ్ కరెన్సీ పిఎల్ఎన్. అక్కడి వారు జిలోట్ అని పిలుస్తారు. నేను చూసిన యూరప్ దేశాల్లో అత్యంత చవకైన దేశం పోలాండ్ మాత్రమే. మన ఆహార పదార్థాలూ దొరకుతాయి. వార్సా నగరంలో లిటిల్ ఇండియా అనే స్టోర్ అందుకు కేరాఫ్ అడ్రస్. ఈ స్టోర్ నడుపుతుంది ఎవరో కాదు! కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన కాట్రగడ్డ చందు. మింజు జెర్జ్‌లో ఇంటి అద్దెలు తక్కువే. అంతే కాదు ఇక్కడ ప్రతి ఇంటిలో పెంపుడు జంతువులు సాధారణం. ఇక్కడ పెట్రోల్ బంకుల్లో ఎవరికి వారే పెట్రోల్ నింపుకోవాలి. తర్వాత కౌంటర్‌లో డబ్బు చెల్లించాలి. మన లాగా పెద్ద పెద్ద క్యూలు ఏమీ ఉండవు. మోసాలు, దొంగతనాలు గురించి నేను ఎప్పుడూ వినలేదు ఇక్కడ.

మింజు జెర్జ్ నుండి 12 కిలీమీటర్ల దూరంలో బెర్లిన్ వెళ్లే దారిలో బంకర్లు కనిపిస్తాయి. రష్యా సైన్యం జర్మనీని ఆక్రమించాలంటే ఈ మార్గం గుండానే వెళ్లాలి. వారిని నియంత్రించేందుకు 300 అడుగుల లోతున ఈ బంకర్ నిర్మించారు. దీని పొడవు 32 కిలోమీటర్లు. పటిష్టమైన గోడలతో ఎక్కడా చెక్కు చెదరని ఈ నిర్మాణాన్ని ఒక క్రమ పద్ధతిలో ప్రణాళికా బద్ధంగా నిర్మించారట. గైడ్ సహాయంతో అతి ఇరుకైన ద్వారం లోనుండి బంకర్ లోపలకు వెళ్లాం. లోపల అప్పటి నాజీ సైనికులు ప్రయాణించేందుకు వీలుగా ఏర్పాటు చేసుకున్న చిన్న ట్రైన్ కనిపిస్తుంది. వారు

వాడిన టూత్ పేస్టు, బూట్లు, రేడియో ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి అక్కడ. ఈ బంకర్ ఉన్నంత మేరా భూమిపైన డ్రాగన్ వే ఉంటుంది. యుద్ధ టాంకర్లు ఈ సరిహద్దుని దాటకుండా కొంత ఎత్తులో సిమెంట్ దిమ్మలు నిర్మించారట. ఈ బంకర్ల నిర్మాణం జరుగుతున్నప్పుడు హిట్లర్ ఇక్కడికి వచ్చాడని గైడ్ ద్వారా తెలిసింది.

పోలాండ్‌లో నేను చూసిన తర్వాత ప్రదేశం ఆస్సువిట్జ్. ఇది మింజు జెర్జ్‌కి 400 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. నవంబర్‌లో వరుసగా వారం రోజులు సెలవు రావడంతో నేను స్థానిక మిత్రుని సహకారంతో ఆస్సువిట్జ్‌లోని ఆష్విట్జ్ మ్యూజియాన్ని సందర్శించాం. ఈ మ్యూజియం బయట సుమారు 50 టూరిస్టు బస్సులు ఆగున్నాయి. అంత మంది టూరిస్టులున్నా అంతా నిశబ్దం.ఆ ప్రదేశ వివరాలు చెప్పేందుకు ఇంగ్లీషు గైడ్ కావాలంటే 25 జిలోట్‌లు చెల్లించాలి. అలా 20 మందికి ఒక గైడ్ ఉంటాడు. ఆ గైడ్ చెప్పేది వినడానికి హెడ్‌ఫోన్స్ ఇస్తారు. ఇక లోపలకు ప్రవేశించాం. దీన్ని ఇప్పుడు మ్యూజియం అంటున్నారు కానీ, తర్వాత తెలిసింది రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఇదొక మృత్యు కుహరం. ఈ క్యాంపు మూడు భాగాలుగా నిర్మించారు.

ఆష్విట్జ్–1 లోకి మొదట ప్రవేశించాము. ఇది రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధ ఖైదీలని, యూదులని ఉంచడానికి తగిన ప్రదేశం కోసం వెదుకుతుంటే, రైలు మార్గం అనువుగా ఉన్న ఈ ప్రాంతాన్ని ప్రతిపాదించాడట జర్మన్ నాజీ అధికారి హిమ్లర్. ఇక్కడికి రైళ్లలో ఒక్కో పెట్టెలో 200 మందిని కుక్కి, 3రోజుల పాటు ప్రయాణించాక ఇక్కడికి చేరుకునేవి. అవి ఇక్కడికి చేరే లోపు సగం మంది చనిపోయేవారట. బతికిన వారిని ఈ క్యాంపుల్లో చంపేవారట. దాదాపు 12 లక్షల మంది ఇక్కడ చంపబడ్డారట. మొదటి బ్లాకులో అక్కడ నివశించిన యూదుల దుస్తులు, బూట్లు, వస్తువులు, చేతి కర్రలు కుప్పలుగా పోగుపడి కనిపిస్తాయి.



ఉప్పు రాతి విగ్రహం

రెండవ బ్లాకులో ఆ క్యాంపులో చంపబడ్డ మనుషుల ఫోటోలు వారు వాడిన తిండి పాత్రలు ఉన్నాయి. ఈ క్యాంపుల్ని హిట్లర్ మనుషుల్ని మృత్యు ఒడికి చేర్చే పరిశ్రమలా వాడుకున్నాడనిపిస్తుంది. రోజుకి 400 నుండి 6000వేల మందిని చంపాలనేది టార్గెట్ పెట్టుకునేవారట. గ్యాస్ ఛాంబర్లు, శవాల్ని కాల్చే ఫర్నేస్‌లు 24 గంటలూ పనిచేస్తుండేవి. ఇక్కడ వారానొకసారి స్నానం అనే నెపంతో టాయిలెట్ అని రాసున్న గదుల్లోకి ఖైదీలను పంపేవారట. ఒక్కో గదిలోకి 50 మందిని కురిమేవారట. వారు పైనున్న షవర్ ఆన్ చెయ్యగానే గ్యాస్ విడుదలై లోపల ఉన్న వాళ్లంతా శవాలుగా మారేవాళ్లు. ఆ తరువాత పక్కనే ఉన్న ఫర్నేస్‌లో వాటిని తగలబెట్టేవారు. ఇదంతా 20 నిమిషాల్లో పూర్తయ్యేదట. ఇక్కడ బందీ అయిన వారి సగటు జీవితం మూడు నెలల కంటే ఎక్కువ ఉండేది కాదట. ఒక్కో గదిలో 400 మందిని ఉంచేవారు. ఆ మంచాలు ఇప్పటికీ ఉన్నాయి. ఈ క్యాంపుకు ఖైదీల తాకిడి ఎక్కువవడంతో అస్విట్జ్–2, 3 క్యాంపులు 1942 –43 మధ్య నిర్మించారట. ఇక్కడ గోడలు, చుట్టు పక్క పరిసరాల్లో ప్రాణాలు అరచేత పట్టుకొని బితుకు బితుకు మంటూ బతుకీడ్చిన బందీలు, మానవ మృగాల ధాటికి రక్తమోడ్చిన మనుషుల ఆర్తనాదాలే మా చెవుల్లో మారుమోగుతున్నాయి. మనసంతా చరిత్ర మిగిల్చిన బాధతో బరువెక్కింది.

ఉప్పు గనిలో నీటి కొలను

అక్కడ నుండి 90 కిలోమీటర్ల దూరంలో క్రాకో నగరంలోని ఉప్పు గని ఉంది. అది తప్పక చూడాల్సిన ప్రదేశం అని చెప్పడంతో అక్కడికి బయలుదేరాం. పోలాండ్‌లో అతిపెద్ద పురాతన నగరాల్లో క్రాకో రెండోది. చారిత్రిక భవనాలు, మ్యూజియంలు ఈ నగర వైభవానికి ప్రతీకలు. ఇక్కడ ఉప్పు గని సందర్శనీయ ప్రదేశం. ఏడిదికి సుమారు 12 లక్షల మంది ఈ గనిని సందర్శిస్తారట. రాతి నుండి ఉప్పును తీసిన అతి కొద్ది ప్రాచీన గనుల్లో ఇది ఒకటి. 13వ శతాబ్దం నుండి 2007 వరకు ఈ గనిలో కార్యకలాపాలు కొనసాగించారు. ఆ తర్వాత అక్కడ నీరు చేరడంతో కేవలం సందర్శనా స్థలంగా మాత్రమే మిగిలిపోయింది. అయితే ఇక్కడ మరో ప్రత్యేకత ఏమిటంటే అక్కడ పనిచేసిన గని కార్మికులు చెక్కిన రాతి విగ్రహాలు, క్రీస్తు జీవిత వృత్తాంతాన్ని వివరించే పలు రాతి చిత్రాలు, పోలాండ్ సంస్కృతి జీవన విధానాన్ని తెలిపే చిత్రాలు దీనిని మ్యూజియంగా మార్చేశాయి. అంతేకాదు ఇక్కడ చర్చి కూడా ఉంది. అందులో వివాహ వేడుకలూ జరుగుతుంటాయి. అయితే కొంచెం ఖరీదు అంతే. మేము నాలుగు శాతం మాత్రమే చూడగలిగాం. ఇంకా 250 కిలోమీటర్ల మేర ఈ గని విస్తరించి ఉంది. రాతి నుండి కూడా ఉప్పు తీస్తారన్న సంగతి నాకు ఇక్కడే తెలిసింది. ఆ రాయి కూడా నీళ్లతో కలిసిన ఘన పదార్థంలా ఉంది. అక్కడక్కడా నీళ్ల కొలనులు కూడా కనిపిస్తాయి. ఇవే కాదు! ఇంకా ఎన్నో అద్భుతాలు... మరెన్నో ఆశ్చర్యాలు. ఇవన్నీ వెరసి సందర్శకులకు వీనుల విందే.

పోలాండ్ అందాల గురించి, సందర్శనీయ ప్రదేశాల గురించి మరోసారి చెప్పుకుందాం.

- వేమూరి రాజేష్

◆ కథ

అమ్మ

గూడూరు గోపాల కృష్ణమూర్తి ,
08922 231605

'మనం మానవ మాత్రులం. మనిషికి భావోద్వేగాలుంటాయి. భావోద్రేకాలుంటాయి. సంఘర్షణలుంటాయి. కష్టసుఖాలుంటాయి. వాటన్నిటి కలయికే జీవితం. ఇలాంటి జీవితంలో అన్ని పనులూ ఒకే పర్యాయం చేయాలని ప్రయత్నించడం అత్యాశ. అలా తొందరపడితే ఏపనీ ఏకాగ్రతగా పూర్తిచేయలేము. అంతేకాదు ఒక పని సగంలో వదిలి మనసు మరొక పనివైపు పరిగెత్తిందా, చంచలత్వం ఆవహించినట్టే. ఇక శ్రమ, సమయం రెండూ నాశనం అవుతాయి. దాని పర్యవసానం తీవ్ర అసంతృప్తి మిగులుతుంది.' ప్రింటింగ్ ప్రెస్‌లో బైండిగ్ పనిచేసుకుంటున్న సూర్యం మెదడులో తొలుస్తున్న ఆలోచనలివి.

"సూర్యం ! ఈ రోజు పేపర్లో ఓ హృదయ విదారకరమైన సంఘటన ఒకటి చదివాను. అది చదువుతూ ఉంటే ఇలాంటి మనుషులుకూడా ఉంటారా అనిపించింది." అప్పుడే అక్కడికి వచ్చిన మూర్తి బాధపడుతూ సూర్యంతో అన్నాడు. మూర్తి, సత్యం ఇద్దరూ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తున్నారు. ఇద్దరూ మంచి స్నేహితులు. అంతకు మించి లోకాభిరామాయణం చర్చించడంలో ఆసక్తి ఉన్నవారు.

"నేను పేపరు చూడలేదు. ఏంటి విషయం?" అన్నాడు సూర్యం .

"కన్న తల్లికి పట్టెపడన్నం పెట్టడం, వృద్ధాప్యంలో ఆమె మంచి చెడ్డలు చూసుకోవాల్సిన కనీస బాధ్యతను మరిచిపోయిన ఓ కొడుకు తల్లి జబ్బునపడితే , మానవత్వం కూడా మరిచిపోయి, ఆమె తనకి భారమని భావించి, బ్రతికుండగానే శ్మశాన వాటికలో ఒంటరిగా వదిలేసి వెళ్లాడట ఆ కర్కోటకుడు. అంతే కాదు వెళ్తూ వెళ్తూ కాటికాపరికి తల్లిదహన సంస్కారాల నిమిత్తం కొంత డబ్బిచ్చి తల్లి రుణాన్ని అంతటితో వదిలించుకున్నాడట ఆ ఘనుడు. దానికి బదులు ఏ అనాథ ఆశ్రమంలోనో, వృద్ధాశ్రమంలోనో చేర్పించినా బాగుండును " బాధతో కలిసిన ఆవేశంతో అన్నాడు మూర్తి.

"మనిద్దరం చిన్న వయస్సులోనే తల్లిప్రేమకు దూరమైనవారం. అమ్మపాశం రుచి చూడలేని దురదృష్టవంతులం. వాడికి అమ్మవిలువ తెలియకే అలా చేసుంటాడు" ఒక నిట్టూర్పువిడిచి అన్నాడు సూర్యం.

"మన బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకుంటే మన మనస్సుని లాక్కుపోయేది అమ్మ గురించిన గుర్తులే. బాల్యంలో ప్రేమతో పెనవేసుకుని ఉండేది అమ్మే. ఆమె త్యాగం మరువలేనిది. కలిమిలేముల్లో తన పిల్లల కోసం ఎన్నో కష్టాలు, నష్టాలని, ఒడిదుడుకుల్ని ఎదుర్కొని, ఎన్నో త్యాగాలుచేసిన అమ్మ ఎవరికైనా ఆరాధ్య దేవతే.

ఇంటికి ఎవరైనా అతిథులు వస్తే అమ్మకాపూట పస్తులే. తనకుంచుకున్న ఆ నాలుగు మెతుకులూ అతిథులకి వడ్డించి తను మాత్రం మజ్జిగ అన్నంతో సరిపెట్టుకునే త్యాగమూర్తి ఆమె. మా అమ్మ విషయమే తీసుకో. నాకేమైనా చిన్న దెబ్బతగిలినా తల్లడిల్లిపోయేది. జ్వరం వస్తే నిద్రమానుకుని రాత్రంతా నా దగ్గరే కూర్చునేది. తనకి అక్షర జ్ఞానం లేకపోయినా అంతకు మించిన సంస్కార జ్ఞానంతో నన్ను చదివించేది. తను బ్రతికున్నంత కాలం నాకోసం తల్లడిల్లిపోయేది". ఇలా చెప్పుకుపోతున్నాడు మూర్తి.

బాల్యంలో తనని శాశ్వతంగా వదిలిపెట్టి అసువులు బాసిన అమ్మ గురించి అతను అలా చెబుతున్న సమయంలో అతని ముఖంపై ఆవేదన స్పష్టంగా అగుపడుతోంది. మూర్తి చెప్పింది వింటూ కలత బారిన మనస్సుతో సూర్యం కూడా ఆలోచనలో పడ్డాడు.

"అలా అని నాన్న చేసిన త్యాగం తక్కువనికాదు. అతనూ ఎంతో త్యాగమూర్తే. మానవ జీవితం అనే బండికి అమ్మ, నాన్న ఇద్దరూ రెండు చక్రాలు. అమ్మ, నాన్న చేసిన త్యాగాల ఫలితంగా పిల్లలు తమ భావి జీవిత పునాదులు నిర్మించుకుంటారు"

"నీ భావాలతో నేను ఏకీభవించలేకపోతున్నాను"

"అంటే"

"నాన్న పరమ స్వార్థపరుడు " సూర్యం మాటలు మూర్తికి నచ్చలేదు.

"సూర్యం ! నీవు అలా ఎందుకను కుంటావు? అమ్మ ఇంటిలో మన ఆలనాపాలనా చూస్తుంది. నాన్న తన పిల్లల భవిష్యత్తుకోసం తన సుఖాన్ని కూడా పట్టించుకోకుండా కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదిస్తాడు. తన సంపాదన కుటుంబానికి, ముఖ్యంగా తన పిల్లల భవిష్యత్తుకోసం ఖర్చు పెడతాడు. ఆ సమయంలో తన బాగోగులు కూడా చూసుకోడు. అది నాన్న చేసే త్యాగం కాదా ?"

"ఊం....! అతనిదీ ఓ త్యాగమేనా ? భార్య చనిపోతే వెంటనే మరో పెళ్లికి సిద్ధపడతాడు నాన్న. అదే అమ్మయితే అలా చేయగలదా? అదంతా ఎందుకు మూర్తి ? మీ అమ్మ చనిపోతే మీ నాన్న మళ్లీ పెళ్లిచేసుకోలేదా ? మానాన్న మళ్లీ పెళ్లిచేసుకోలేదా ?" సూర్యం మాటలు మూర్తిని ఆలోచనల్లో పడేశాయి.

"నిజమే సూర్యం! కానీ, తండ్రిలేకపోయినా తల్లి ఒక్కతే బిడ్డలను సాకగలదు. కానీ తండ్రికి ఆశక్తి సామర్థ్యాలు ఉండవు. ఒక్క మీ నాన్న, మా నాన్నేకాదు అసలు మగవాళ్ల స్వభావంలోనే అమ్మకున్న ఓర్పు, నేర్పు లేవంటాను"

మూర్తి మాటలు సూర్యాన్ని ఆలోచింపచేస్తున్నాయి. 'అమ్మ ప్రేమగా గోరుముద్దలు పెడుతుంది. మంచి కథలు చెబుతుంది. జబ్బుచేస్తే సేవ చేస్తుంది. అవసరమైతే పస్తు ఉంటుంది.

తప్పు చేస్తే మందలిస్తుంది. అమ్మలో లాలిత్యం, ప్రేమ, త్యాగం అన్నీ మిళితమైఉంటాయి. మరి నాన్న , నాన్న ప్రేమను పంచుతాడు. త్యాగాలు చేస్తాడు. కానీ అమ్మంతకాదు. అమ్మలా నాన్న లాలిత్యంగా ఉండలేడు. లాలిత్యం అన్నది అమ్మ సహజ ఆస్తి.' ఆలోచనలోపడి స్తబ్ధుగా ఉండిపోయిన సూర్యాన్ని,

"రేయ్, పద టీ తాగొద్దాం" తట్టి అడిగాడు మూర్తి.

"నేను రానులే నీవు వెళ్లు" అన్నాడు సూర్యం.

"నీ ఇష్టం" అంటూ మూర్తి బయటకు

వెళ్లాడు.

సూర్యం ఆలోచనలు వర్తమానం నుండి భూతకాలం వైపుకు మళ్లాయి. అమ్మ గుర్తుకు వచ్చింది. ఆమెతో తను గడిపిన మధురక్షణాలు గుర్తుకొచ్చాయి. తన తండ్రి రామశాస్త్రి పురోహితుడు. కొడుకు చక్కగా ఇంగ్లీషు చదువు చదువుకుని దర్జాగా ఆఫీసులో ఫ్యాను కింద కూర్చుని ఉద్యోగం చేయాలని సూర్యం తల్లి కోరిక. తండ్రికి మాత్రం కొడుకును ఇంగ్లీషు చదువు చదివించడం ఏమాత్రం ఇష్టం లేదు. భార్య పోరు భరించలేక, కొడుకును కాన్వెంట్‌లో చేర్పించాడు.

సూర్యం కాన్వెంటు డ్రెస్ వేసుకుని, టై కట్టుకుని దర్జాగా కాన్వెంటుకి వెళ్లి, టకటక కాన్వెంటులో నేర్చుకున్న రైమ్స్ చిలకపలుకుల్లాగా వల్లెవేస్తుంటే అమ్మ మురిసిపోయేది. దురదృష్టం వెంటాడుతున్నప్పుడు

తాడేపామై కాటువేస్తుందట. అకస్మాత్తుగా అమ్మకి విషజ్వరం వచ్చింది. మంచంపై పడ్డ ఆమె మరిలేవలేదు. మృత్యుదేవత కబంధహస్తాల్లో చిక్కుకుని శాశ్వితంగా దూరమయింది . అమ్మ దూరమయిందన్న బెంగతో సత్యం చదువుపై శ్రద్ధపెట్టలేకపోయేవాడు.

'నీకు చదువు మీద శ్రద్ధ లేదు. పురోహితం నేర్చుకుని నాకు సాయంగా ఉందువుకాని ' అన్నాడు తండ్రి. తనకి కూడా చదవాలనిపించలేదు. తన చదువు అంతటితో ఆగిపోయింది. ఆ సమయంలోనే తన తండ్రి మరో ఆమెను పెళ్లిచేసుకున్నాడు. తండ్రి తిరిగి పెళ్లిచేసుకోవడం తనకి నచ్చలేదు. తండ్రి మళ్లీ పెళ్లిచేసుకున్నాడనే కోపంతో పురోహితం నేర్చుకోవడం మానేశాడు. ఇలా తను రెండింటికీ చెడ్డ రేవడిలా తయారయ్యారు.

◆ ◆ ◆

సత్యాన్ని మారుటి తల్లి సుభద్ర చాలా ప్రేమగా చూసుకునేది. కానీ సత్యమే ఆమెను విసుక్కునేవాడు.కసురుకునేవాడు. సహనమూర్తి అయిన సుభద్ర అవన్నీ భరిస్తూనే సత్యాన్ని సొంత కొడుకులా చూసుకునేది.

ఓ రోజు తండ్రి తన తల్లి గొలుసు మారుటి తల్లికి ఇవ్వడం చూశాడు సూర్యం. అది తన తల్లికి ఇష్టమైన గొలుసు. అది చూసి సహించలేని సూర్యం ఆమె చేతిలో నుండి ఆ గొలుసు లాక్కున్నాడు. తను చేసిన పనికి తండ్రికి పిచ్చి కోపం వచ్చింది. గొడ్డును బాదినట్టు బాదాడు. సూర్యానికి ఆ రాత్రి విపరీతమైన జ్వరం . తన మారుటి తల్లి రాత్రుళ్లు నిద్రకూడా మానుకుని తనకి సేవచేసింది. అంత సేవ చేసినా ఆమె మీద సత్యానికి కోపం పోలేదు. ఆమె పట్ల కృతజ్ఞత చూపకుండా చీదరించుకునేవాడు. అయినా ఆమె ఒక్క క్షణం చిన్న బుచ్చుకున్నా వెంటనే తన మీద వాత్సల్యాన్ని చూపిస్తూ నవ్వుతూ వెళ్లిపోయేది. బహుశా ! తనని ద్వేషించిన వాళ్లని ప్రేమించడం, క్షమించడం, వాళ్ల మీద ఔదార్యం చూపించడమే ఆమె సిద్ధాంతమై ఉంటుంది.

కాలం గడుస్తుండగా తండ్రి అకాల మృత్యువుపాలయ్యాడు . సూర్యం పరిస్థితి మరింత అయోమయానికి గురైంది. తనకి పౌరహిత్యం రాదు. అందుకే తండ్రి పురోహితాన్ని వేరే వారికి అప్పగించి అందులో సగం వాటాను ప్రతి నెలా తను తీసుకునేవాడు. మారుతల్లికి ఒక్క రూపాయి కూడా ఇచ్చేవాడు కాదు. ఇంటిలో ఓ వాటా అద్దెకివ్వడం వల్ల వచ్చిన డబ్బుతో ఆమె గుట్టుగా కుటుంబాన్ని లాక్కొచ్చేది.

❝ "నన్ను క్షమించమ్మా ! నీ పట్ల చాలా అమానుషంగా ప్రవర్తించాను " వెక్కి వెక్కి ఏడ్చాడు. ఆ క్షణం సూర్యం పసిపిల్లోడయ్యాడు. సుభద్రమ్మ ప్రక్కనే ఉంది. కానీ ఆమె ఓదార్చలేదు .... ఒక్కసారి ఆమెను అమ్మా అని పిలవాలని, ఆ పిలుపు విన్న సుభద్రమ్మ , చేతి వేళ్లతో తన తలను నిమరాలని ఎంతో ఆశించాడు. ..గుండెలు అవిశేట్టు మొత్తుకున్నాడు. సుభద్రమ్మ ప్రక్కనే ఉంది........కానీ ఓదార్చలేదు...... ఇంకెప్పటికీ అతని కోరిక తీర్చలేదు........ ❞

సూర్యానికి పెళ్లైన తర్వాత అద్దెకిచ్చిన వాటా ఖాళీచేయించి దానిలో తను వేరు కాపురం పెట్టాడు. జీవనోపాదికి ప్రెస్‌లో జాయిన్ అయ్యాడు. పురోహితంలో వచ్చిన ఆదాయం, ప్రెస్‌వాళ్లు ఇచ్చే జీతంతో తన జీవితం సాఫీగా సాగిపోతుంది. అయితే తన మారుటి తల్లి జీవితమే చాలా హీనంగా మారింది. అయినా ఆమె ఆత్మస్థైర్యాన్ని విడిచిపెట్టలేదు. అప్పడాలు, వడియాలు తయారుచేసి అమ్మేది.

ఒక లాయరుగారింట్లో వంట చేసి వచ్చిన డబ్బుతో బతికేది. ఇల్లు ఆవిడ పేరున ఉంది. కాబట్టి తను ఊరుకున్నాడు కానీ. అదే తన పేరున ఉంటే ఏనాడో ఆవిడ్ని ఇంటి నుండి గెంటేసి ఉండేవాడు . అంత స్వార్థపరుడుగా తయారయ్యాడు సూర్యం. తనలోని మానవత్వం మరుగున పడిపోయింది.

తన కడుపున పుట్టకపోయినా సూర్యం చివరివరకూ అమితంగా ఇష్టపడేది సుభద్ర. ఆమె ఆఖరి దశలో కూడా సూర్యాన్ని, అతని భార్యా, పిల్లల్ని కలవరిస్తుండేది. ఒకే ఇంట్లో వేరు వేరు వాటాల్లో ఉంటున్నా, చివరి రోజుల్లోకూడా సూర్యం, అమెతో ప్రేమగా మాట్లాడిన పాపానపోలేదు. . పైగా తన భార్యా, పిల్లల్ని కూడా ఆమె దగ్గరకు వెళ్లొద్దని ఆంక్ష విధించాడు. అనాథగానే ఆమె కన్నుమూసింది.

'ఇప్పుడు ఇదొక ఖర్చు ' అని మనస్సులో తిట్టుకున్నాడు సూర్యం. సుభద్రమ్మ కన్నుమూసిందని వార్త తెలియగానే ఆమె వంట చేసి పెట్టిన ఇంటి యజమాని లాయరుగారు వచ్చారు.

"సూర్యం, సుభద్రమ్మగారు ఇంటికాగితాలు, డబ్బు పాతిక వేలు నా దగ్గర దాచిపెట్టారు. ఇవి తన తదనంతరం నా కొడుకు సూర్యానికి అప్పచెప్పమని చెప్పారు " అని సూర్యానికి ఇచ్చి వెళుతూ ఆమెకు నీవంటే ఎనలేని అభిమానం. మా ఇంట్లో ఎప్పుడూ నీ గురించి, నీ పిల్లల గురించిన సంగతులే మాట్లాడుతుండేది. నీకు ఆమె మారు తల్లని ఈరోజు ఎవరో బయట అనుకుంటుంటే విన్నాను. నాకు ఆశ్చర్యం వేసింది. ఆమె ఔన్నత్యం చూసాను. ఇప్పుడు విన్నాను. అలాంటి తల్లికి పాదాభివందనం చేయాలి " అంటూ చెమ్మగిల్లిన కళ్లతో సుభద్రమ్మ పార్థివ దేహానికి నమస్కరించాడు లాయరు.

'ఏ రక్తసంబంధం లేకపోయినా లాయరుగారు ఆమె పట్ల అంత అభిమానం చూపించాడు. నన్ను ఆమె కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చింది. కానీ నేను ఇంత దుర్మార్గంగా ప్రవర్తించాను ' అని మనస్సులో కుమిలిపోయాడు సూర్యం.

"నన్ను క్షమించమ్మా ! నీ పట్ల చాలా అమానుషంగా ప్రవర్తించాను " వెక్కి వెక్కి ఏడ్చాడు. ఆ క్షణం సూర్యం పసిపిల్లోడయ్యాడు. సుభద్రమ్మ ప్రక్కనే ఉంది. కానీ ఆమె ఓదార్చలేదు .... ఒక్కసారి ఆమెను అమ్మా అని పిలవాలని, ఆ పిలుపు విన్న సుభద్రమ్మ , చేతి వేళ్లతో తన తలను నిమరాలని ఎంతో ఆశించాడు. ..గుండెలు అవిశేట్టు మొత్తుకున్నాడు. సుభద్రమ్మ ప్రక్కనే ఉంది........కానీ ఓదార్చలేదు...... ఇంకెప్పటికీ అతని కోరిక తీర్చలేదు........

◆ ◆ ◆

గతం తలుచుకుంటున్న సూర్యం మనస్సులో తన ప్రవర్తన పట్ల తనకే అసహ్యం. సుభద్రమ్మను ఒక్కసారి అమ్మ నన్ను క్షమించు అని అడగాలన్న కోరిక. ఆమె ఇక కనపడదన్న ఆవేదన అన్నీకలిసి కడుపులో మొదలై కళ్ల వెంట ప్రవహిస్తోంది కృష్ణమ్మ. మూర్తిని పిలిచాడు. ఇద్దరూ కలిసి స్మశానానికి బయలుదేరారు. అమ్మ ప్రేమను మరో అమ్మ దగ్గర పొందటానికి. కాదు......మరు భూమిలో నిర్జీవమై పడి ఉన్న ఆ తల్లికి ప్రేమను పంచడానికి... ◆

'ఘటోత్కచుడు' సినిమా చూసారా. పోనీ సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన 'రోబో' చిత్రం చూసారా. ఈ రెండు సినిమాల్లో రోబో అన్ని పనులు చేస్తుంటుంది. కాఫీ అందివ్వడం దగ్గర నుండి పిల్లలను ఆడించడం వరకు. అంతే కాదు భావోద్వేగాలకు కూడా గురవుతుంది. ఇది రీల్ లైఫ్‌లో కాబట్టి సాధ్యమయింది.....రియల్ లైఫ్‌లో సాధ్యమా అని ఎవరైనా అంటే వారు తమ అభిప్రాయాన్ని మార్చుకోవాల్సిందే. ఎందుకంటారా ....నిజ జీవితంలో కూడా రోబోట్లు అన్నీ రకాల పనులూ చేస్తున్నాయి. మనిషి తోడు లేని లోటుని పూడుస్తాయి. టెక్నాలజీ విపరీతంగా పెరిగిపోతున్న ఈ తరుణంలో అన్ని పనులు చేసే రోబోలు వచ్చేసాయి. సూపర్ మార్కెట్‌లో సహాయకుడిగా కస్టమర్లకు కావాల్సిన వస్తువులు అందిస్తాయి. ఇళ్లు చక్కబెట్టేస్తాయి. వైద్యం చేయడమే కాదు.అవి చేయని పనులు లేవు.

'రోబో' సేవకులు వచ్చేస్తున్నారు!

ఇల్లు చక్కదిద్దేస్తుంది

ఇల్లు శుభ్రంగా వుంటే మన ఆరోగ్యం కూడా బాగుంటుంది.కొకొ రోబో, జపనీస్ ప్రీమియం వాక్యుమ్ రోబోట్ వంటి రోబోలు బూజు దులపడం దగ్గర నుండి బండలు శుభ్రం చేయడం, గోడలను శుభ్రపరచడం వంటి అన్నీ పనులూ చేస్తాయి. అంతే కాదు 'యూవీ లైట్' సహాయంతో ప్రమాదకరమైన బ్యాక్టీరియాను సైతం సమూలంగా తొలగిస్తాయి. అందుకే విదేశాల్లో అనేక ఆసుపత్రుల్లో వీటిని వాడుతున్నారు. రక్షణ సమస్య ఉన్న చోట ఈ రోబోట్‌లకే భద్రత బాధ్యతలు కూడా అప్పగిస్తున్నారు.

ఆతిథ్యం ఇవ్వడంలో ఫస్ట్

సేవారంగంలో కూడా రోబోట్‌లను వినియోగిస్తున్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో వృద్ధులు, పిల్లలను చూసుకునే సమయం లేక చాలా మంది ఇబ్బంది పడుతుంటారు. వారికి సమయానికి భోజనం పెట్టడం, మందులు ఇవ్వడం, దగ్గరుండి వారి ఆలనా పాలనా చూడలేకపోతున్నామని బాధపడుతుంటారు చాలా మంది. వారికి ఇప్పుడు ఒక శుభవార్త. ఎందుకంటారా ఇలాంటి పనులన్నీ చేసిపెట్టడం కోసం కరేబియన్ క్రూయిజ్ లైనర్ రోబోట్‌ను తయారు చేశారు. ఇది ప్రపంచంలోనే స్మార్ట్ షిప్ అని పిలవబడే తొలి రోబో. ఇది జ్యూస్ చేయడం, వంట వండటం, భోజనం సిద్ధం చేయడం, వృద్ధులు, పిల్లల ఆలనా పాలనా చూసుకోవడం వంటి పనులన్నీ చేస్తుంది. అంతే కాదు. వంట కూడా బాగా చేస్తుంది. ఒకటి రెండు కాదు ఏకంగా అతి తక్కువ సమయంలో ఆరు వందల రకాల వంటకాలు తయారు చెయ్యగలదు. రెస్టారెంట్‌కి కస్టమర్లు వచ్చినప్పుడు తలుపు తీసి స్వాగతం పలకడం దగ్గర నుండి, వారికేం కావాలో తెలుసుకోవడం, వాటిని తయారు చేయడం, వడ్డించడం ....ఇలా ప్రతి పనీ రోబోట్ చేస్తే ఏలా ఉంటుంది ? ఆశ్చర్యపోకండి నిజమే. జపనీయులు ఎంతో ఇష్టంగా తినే 'సుశి రోల్'ను చకచకా చేసేసే రోబోట్ కూడా వుంది. గంటకు 2500 'సుశీ రోల్స్'ను ముక్కలు చేయగల ఈ యంత్రుణ్ణి (రోబో) తయారు చేసిన ఘనత ఇద్దరు చైనీస్ విద్యార్థులు, ఒక జపనీస్ సంస్థదే.

ఎగిరుతూ ఎవరికేం కావాలో అందించే రోబోట్‌ను 2015 చివరినాటికి రానుంది.

రోబో గోల్ఫ్

గోల్ఫ్ ఆటలాడుతున్నారా ? మీకు ఎప్పుడూ చేదు అనుభవమే ఎదురవుతుందా? అయితే మీకు సహాయపడేందుకు రోబో గోల్ఫ్ ప్రో అనే దక్షిణ సీటెల్‌లో పదడుగుల పొడవాటి రోబో సిద్ధంగా ఉంది. గోల్ఫర్లు బంతిని తరలించే తీరు, ఆట తీరులో మార్పులను చాలా సూక్ష్మంగా గమనిస్తుంది. ఆటగాళ్లకు చేదోడు వాదోడుగా నిలుస్తుంది. ఒక్క గోల్ఫ్‌కే పరిమితం కాలేదు. చెస్, బ్యాట్‌మెంటన్ వంటి క్రీడల్లో కూడా ఈ రోబోట్‌లకు ప్రవేశం ఉంది. ఇవి రంగంలోకి దిగాయంటే ఎంత కాకలుతీరిన ఆటగాడికైనా ముచ్చెమటలు పట్టాల్సిందేనట.

లాయర్ రోబో

సాధారణంగా ఒక కేసు వాదించమమని లాయర్ దగ్గరకు వెళితే ఆ లాయర్ కు ఫీజు చెల్లించాలి. అంతటితో సరిపోతుందా...ఇంకా ఎన్నో దక్షిణలు సమర్పించుకోకపోతే కానీ వారి కరుణా కటాక్షాలు సిద్ధించవు. అయితే భవిష్యత్తులో ఈ సమస్య మనకు తలెత్తకుండా 2030 నాటికి రోబో లాయర్లు వచ్చేస్తున్నాయట. అవి నల్లకోటు ధరించి వాదించడమే కాదట, అలసట అనే మాటకు చోటులేకుండా కనీసం 12 మంది కింది స్థాయి ఉద్యోగులు చేసే పనిని ఒక్క రోబోనే పూర్తిచేస్తుందని సమాచారం. ప్రస్తుతం

న్యాయవాద విద్యను అభ్యసించాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. అంతేకాక కేసులు కూడా ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయాయి. సత్వరం కేసులన్నీ పరిష్కారమవ్వడానికి రోబోల సహకారం తీసుకునే దిశగా ఆలోచిస్తున్నారు. బహుశా ఇంకో ఇరవై ఏళ్లలో రోబో లాయర్లను చూడొచ్చేమో.

వైద్యమూ చేసేస్తాయ్

కొంత మంది ఐఐటి పూర్వ విద్యార్థులు ఆస్ట్రేలియాకు చెందిన లాత్రోబె విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రాజీవ్ భోస్లా, చార్లీలతో కలిసి వైద్యరంగంలోకి రోబోట్ సేవలను ప్రవేశపెట్టారు. ముందుగా మానసిక వైకల్యం, ఆటిజంతో బాధపడుతున్న పిల్లల జీవితాల్లో మార్పు తీసుకురావడం కోసం ప్రపంచంలో అత్యంత అధునాతన రోబోట్లను తయారు చేశారు. సర్జికల్ రోబోట్‌లు కూడా ఉన్నాయి. ఇవి శస్త్ర చికిత్సలు చేస్తున్నాయి.

ముఖ్యంగా బాగా శిక్షణ పొందిన సర్జన్లు, మంచి సాంకేతిక పరిజ్ఞానం కలిగిన రోబోట్‌లను ఉపయోగించి చాలా క్లిష్టమైన, సున్నితమైన ఆపరేషన్లను కూడా చిన్న కోత పెట్టడం ద్వారా చేయగలుగుతున్నాయి. దాని వలన నొప్పి తక్కువగా ఉండటమే కాకుండా త్వరగా కోలుకోవడానికి కూడా అవకాశం ఉంది. ఈ రోబోలను హాస్పటల్‌లో రోగుల సంరక్షణకు కూడా ఉపయోగిస్తున్నారు. పలు ఆస్పత్రులలో రోగులకు భోజనం కూడా సర్వ్ చేస్తాయి.

సహజంగా నడవడానికి ఇబ్బంది పడేవారి కోసం రోబోటిక్ వాకర్‌ని కూడా రూపొందించారు. ఇవి వ్యక్తుల బరువు, కదలికలను అంచనా వేసుకొని స్పందిస్తాయి. ఇవి జంతువుల ఆకారంలో ఉంటాయి. ముఖ్యంగా చిరుతలాగా ఉండే రోబోని " రోబో – చీలూ" అంటారు. ఈ రోబోట్ వేగంగా నడవటానికి సహాయపడుతుంది. అంతేకాక చాలా నిశ్శబ్ధంగా, సమర్ధవంతంగా కూడా పనిచేస్తుంది.



ఎక్కడైనా సరే...

నేడు రోబోట్లను అనేక రకాల ఉత్పాదక రంగాల్లో కూడా విరివిగా ఉపయోగిస్తున్నారు. కార్ల ఉత్పత్తిలో, వెల్డింగ్ చేయడంలో, రంగులు వేయడం వంటి పనులను ఎంతో సునాయాసంగా చేస్తున్నాయి ఈ రోబోలు. అంతేకాక సముద్ర గర్భంలో దాగి ఉన్న వాటిని కనుగొనేందుకు కూడా రోబోలకు ఉపయోగిస్తున్నారు. వీటికి 3డి అమర్చబడి ఉంటుంది. దాని సహాయంతో ఈ పనులన్నీ సులభంగా చేయగలుగుతుంది.

కొన్ని సందర్భాల్లో మనుషులు చేయలేని పనులు కూడా రోబోలు చక్కబెడుతున్నాయి. ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ రంగంలో అయితే ప్రత్యేకంగా పిక్ అండ్ ప్లేస్ రోబోట్‌లు పని చేస్తున్నాయి. తమకు అమర్చబడిన ఆటో మేటెడ్ గైడెడ్ వెహికల్ ఆధారంగా అవి పనిచేస్తాయి. ◆

◆ కవిత్వమ్

దారేటు?!

ఓటు గర్భంలో
ప్రజాస్వామ్యం వుంది
సోషలిజం వుంది
సంక్షేమం వుంది
సంస్కరణ వుంది
అత్యాచారానికి గురై
గర్భం విచ్ఛిన్నమైంది !
ఓటు ఊసర వెల్లిలా
రంగులు మారుస్తుంది
ఇంద్రదేవుడిలా
వేషాలు వేస్తుంది
స్టీలు బిందెగా
ముక్కు పుడకగా
పట్టు చీరగా
రంగుల టీవీగా
కరెన్సీ నోటుగా
అర్ధరాత్రి పయనిస్తుంది
ఇంటింటి తలుపు తడుతుంది
వేషం ప్రదర్శిస్తుంది
నజరానా అందిస్తుంది !
కాళ్లు వున్నచోటే వుంటాయి
చూపు వున్న చోటే వుంటుంది
చేతులు వున్నచోటే వుంటాయి
నోటు జేబులో వాలుతుంది !
ఓటు హద్దుల్ని గీస్తుంది
యుద్ధాల్ని చీల్చుతుంది
రాష్ట్రాల్ని చీల్చుతుంది
న్యాయాన్ని నియంత్రిస్తుంది !
స్విస్ బ్యాంకుకు దారి తీస్తుంది
న్యూజిలాండుకి ప్రవేశిస్తుంది
ఆస్ట్రేలియాలో దాగుతుంది
అమెరికాలో మాటు పడుతుంది !
ఓటును చూసి
పగలంతా భయపడ్డ సూర్యుడు
సాయంత్రానికి కొండల్లో
దాగుతాడు
రేయంతా వణికిన చంద్రుడు
ఉదయానికి మాయమౌతాడు !
ఐదేళ్ల కొచ్చే ఓట్ల పండుగ
ఏటేటా ఏతెంచితే
సంక్రాంతిలా జరుపుకోవచ్చని
చాలా మంది ఓటర్ల
సంయుక్త స్వర ప్రకటనలు !

- అడిగోపుల వెంకటరత్నమ్
9848252946

తులసి నాయర్ ! కళాకారుల కుటుంబంలో పుట్టింది. అమ్మ రాధ. 80వ దశకంలో తెలుగు తెరను ఏలిన కథానాయిక. ఇక అక్క కార్తీక ప్రస్తుతం హీరోయిన్‌గా నిలదొక్కుకునే ప్రయత్నాల్లో ఉంది. పెద్దమ్మ అంబిక... ఒకప్పటి దక్షిణాది నాయికగా మంచి గుర్తింపు పొందిన నటి. మణిరత్నం చేతుల మీదగా వెండితెరకు పరిచయమైన అదృష్టం తులసిది. తొలి ప్రయత్నం 'కడల్' చేదు ఫలితాల్ని మిగిల్చినా, మలి ప్రయత్నంలో వచ్చిన 'యాన్' మాత్రం విజయఢంకా మోగించి తులసిని నటిగా నిలబెట్టిందిది. అమ్మ, అక్క మార్కు లేకుండా సొంతంగా నిరూపించుకోవడానికి తహతహలాడుతున్న ఈ నవ కథానాయిక కుటుంబం.....సినిమాలు....అక్కాచెల్లెళ్ల అనుబంధం గురించి ఇలా చెబుతుంది.

ఆ మాట నన్ను కాపాడింది

నాకు చిన్నప్పటి నుండి నటన మీద పెద్ద ఆసక్తి వుండేది కాదు. కానీ నా పదమూడవ ఏట నుండి దానిపట్ల ఆకర్షణ మొదలైంది. సినిమాలు చూసి...అద్దం ముందు నిలబడి కొన్ని సన్నివేశాలు చేసేదాన్ని. దాని వల్లే నటన పట్ల ప్రేమలో పడిపోయాననుకుంటా.

- నేను సినిమాలు చేస్తానన్నప్పుడు ఇంట్లో కొంచెం కంగారు పడ్డారు. నాలో ఒక నటి ఉందని వాళ్లెప్పుడూ అనుకోలేదు మరి.
- మణిరత్నం దర్శకత్వంలో చేసిన నా తొలి సినిమా పెద్దగా ఆడలేదు. ఆ బాధ నన్ను ఆవరించకపోవడానికి మాత్రం అమ్మ ఇచ్చిన సలహాలే కారణం. "విజయం వరిస్తే తలకెక్కించుకోకు. పరాజయం వస్తే మనసులో పెట్టుకోకు" అంది అమ్మ. ఆ మాటే నన్ను కాపాడింది.
- 'యాన్' చిత్రంలో బాంబే అమ్మాయిగా చేశాను. ఇది గ్లామరస్ పాత్ర. నేను బొంబాయిలో పెరిగినందువల్ల నాకు ఆ పాత్ర చేయడం పెద్ద కష్టం కాలేదు.
- 'గ్లామర్' అనేది వేసుకున్న దుస్తులను బట్టికాక మనం చేసిన పాత్ర మీద...పరిస్థితి మీద ఆధారపడి వుంటుంది. ఉదాహరణకు 'యాన్' చిత్రాన్ని బొంబాయిలో తీశారు. అంటే నా పాత్ర ఆధునిక దుస్తుల్లో కనిపిస్తుంది. 'గ్లామర్' పాత్రలో భాగంగా వుంటుంది కాని ప్రత్యేకంగా కాదు.
- 'కడల్ సినిమా షూటింగ్ అంతా సరదాగా చేశాం మేం. (గౌతమ్ కార్తీక్, నేను) నేర్చుకునే దశలో వున్నాం. అది సినిమా షూటింగ్‌లా కాక కుటుంబ విహార యాత్రలా వుండేది. సెట్‌లో మణి సర్ నన్ను బాగా గారాం చేసేవారు. 'యాన్' చిత్రం కోసం రెండేళ్ల పని చేశాను. వృత్తిపరంగా ఎదగడానికి, స్వతంత్రంగా ఆలోచించడానికి ఎంతగానో ఉపయోగపడింది. నటిగా నా మీద నాకు నమ్మకం కూడా పెరిగింది.
- నాకు ఇంకా పదిహేడేళ్లే. నటిగా చాలా సాధించాల్సి ఉంది. అమ్మ కూడా ఇదే చెప్తుంటుంది. అందుకే పాత్రల ఎంపికలో ఆచితూచి అడుగేస్తాను. నటిగా నా ఎదుగుదలకు ఉపయోగపడే, సవాల్ విసిరే పాత్రలనే చేస్తున్నాను.
- పాత్రల ఎంపిక చేసుకోగల పరిణితి నాలో లేదు. ఆ విషయంలో పెద్దల సలహాలు, సూచనలు నాకు అవసరం. అమ్మ, నేను కలిసి కథ విని చర్చించుకున్నాకే నిర్ణయం తీసుకుంటాం.
- నా జీవితంలో మా నాన్న చాలా ముఖ్యమైన వ్యక్తి. అక్క (కార్తీక) సినిమాల్లో నటిస్తానని అన్నప్పుడు...నాన్నకు ఈ విషయం చెప్పడానికి మేమంతా చాలా భయపడ్డాం. పదహారేళ్ల కూతుర్ని సినిమా రంగానికి పంపడానికి ఇష్టపడతారా ? అని తెగ ఆలోచించాం. అయితే ఆయన అందుకు అంగీకరించడమే కాక.....ప్రోత్సహించారు కూడా.
- నా సినిమా షూటింగులకు వీలున్నంత వరకు నాన్న కూడా వస్తుంటారు. నటులుగా మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహిస్తారు.
- నాన్నకు మంచి బిజినెస్ ఉంది. దాన్ని అభివృద్ధి పరచాలని అనుకుంటున్నాం.
- చిన్నప్పటి నుండి అక్క, నేను చాలా సన్నిహితంగా ఉంటాం. అక్కను నాకంటే పెద్దదానిగా గౌరవించడమే కాదు, ఓ స్నేహితురాలిగా ప్రేమిస్తాను.
- అక్క తన వృత్తిపట్ల చాలా కచ్చితంగా వుంటుంది. సెట్ మీద వుందీ అంటే నూటికి నూటపది శాతం అంకితభావంతో పనిచేస్తుంది. దృష్టి పూర్తిగా పని మీదే వుంటుంది. ఏ మాత్రం పక్కకు పోదు.
- 'కాదల్' సినిమా విడుదలైనప్పుడు అందరూ భారీ అంచనాలతోనే ఎదురుచూశారు. అమ్మతో, అక్కతో పోల్చిచూశారు నన్ను. కాని అలా పోల్చడం సరికాదనిపించింది. ఎందుకంటే నేను ఇప్పుడిప్పుడే సినిమా రంగంలోకి అడుగుపెడుతున్నాను. వాళ్లు అలా కాదు కదా. నేను అక్కతో అస్సలు పోల్చుకోలేను. అప్పటికే తను కొన్ని సినిమాలు చేసింది. మాది నటన నేపథ్యం ఉన్న కుటుంబం కావడంతో నేర్చుకోవడానికి నాకు చక్కటి అవకాశం ఉంది అనుకుంటున్నా. అయితే ఇతరులు మాత్రం దీన్ని ఓ మైనస్‌గా చూస్తుంటారు.
- అక్క నేను ఒక చోట వున్నామంటే...ఎక్కువగా చిన్ననాటి సంగతులే చెప్పుకుంటాం. చిన్నతనంలో నేను చాలా బుద్ధిగా ఉండేదాన్ని. అక్క మాత్రం చాలా కొంటెది. చిన్నప్పుడు ఎంత బుద్ధిగా వుండేదాన్నో అమ్మానాన్నల్ని అడిగి మరీ కథలుగా చెప్పించుకుంటా.
- కుటుంబం అంతా కలిస్తే మా చిన్ననాటి విషయల్నే ఎక్కువగా మాట్లాడుకుంటాం. సినిమాల గురించిన ప్రస్తావన అరుదుగా వస్తుంటుంది.
- ప్రస్తుతానికి సినిమాల మీదే ఎక్కువగా దృష్టి పెట్టాను. అక్క, నేను ఇద్దరం విదేశాలు వెళ్లి చదువుకోవాలని కలలు కన్నాం. ఏం చదవాలనేది నేనింకా నిర్ణయించుకోలేదు. అయితే ఇప్పుడు నేను చేస్తున్న పనికి సంబంధించినదే ఎంచుకుంటాను. ◆

నవ్వుల్ – పువ్వుల్

మూడు సార్లు

వార్డెన్: నీవు చేసిన తప్పుకు నిన్ను మూడు సార్లు ఉరితీయమని ఆర్డర్ వచ్చింది...!
నేరస్థుడు : అయితే ఒకసారి ఇక్కడ తీసేసి, నాకూడా నరకానికి వచ్చేయండి. అక్కడ మిగిలిన రెండు సార్లు తీద్దురుగాని...!

టాలెంట్



రాంబాబు : ఇన్ని దొంగతనాల్ని నీవొక్కడివే చేసావా, ఆశ్చర్యంగా ఉందే...!
దొంగ : చూసారా... నాకెంత టాలెంట్ వుందో. నన్ను గిన్నిస్ బుక్‌లోకి ఎక్కించాలి. నా ఫోటో అందరి ఇళ్లలో పెట్టుకోవాలి.

సూట్ కేస్

భార్య : ఇలా ఎంతకాలమని జేబు దొంగతనాలు చేస్తావ్ ?
దొంగ : పెద్ద పెద్ద సూట్‌కేసులు దొరికేదాకా.

ఆదా !



వెంకట్ : నేను సిటీ బస్ వెనుక పరిగెత్తి 15 రూపాయలు ఆదా చేసా
హరి : నేనైతే కారు వెనుక పరిగెత్తి మూడు వందలు ఆదా చేసా
చరణ్ : ఒరేయ్ నేను మీలాగా చిల్లర రూపాయల గురించి కక్కుర్తిపడను... అందుకే విమానం వెనుక గాలిలో ఎగిరి వేల రూపాయలు ఆదా చేస్తా.

స్విచాఫ్

అరవింద్ : వాడు నీ సెల్ పట్టుకుని పారిపోతుంటే నీవేం చేస్తున్నావురా?
గోవింద్ : మరేం ఫర్వాలేదు, నేను సెల్ స్విచాఫ్ చేసేసానుగా ...

ఫెయిల్



చిట్టి : నేను పరీక్ష పాసైతే రెండువందలు ఇస్తానన్నారు కద నాన్నా
తండ్రి : అవునూ...!
చిట్టి : మరి ఫెయిలయితే ఎంతిస్తారు ?

గంటేగా



భార్య : ఏమండీ, సినిమాకెళదామని చెప్పి గంటయింది, ఇంకా రారేమిటండీ
భర్త : ఓస్ గంటే అయిందా, నేనింకా అయిదుగంటలయింది అనుకున్నా...!

వీలునామా



భార్య : మీ నాన్న తన తదనంతరం మీకు చెందేలా వీలునామా రాసాడంట కదా. ఏం రాసాడేంటి ?
భర్త : ఏం రాసాడా? తను చేసిన అప్పులన్నీ నేను, వాటిపై వడ్డీ అంతా మా తమ్ముడు తీర్చాలని రాసాడు.

తెల్సా

చింటు: నీకొకటి తెలుసా?
బంటి: ఓ.. రెండూ, మూడు, నాలుగూ కూడా తెలుసు.

తప్పించుకోవాలంటే...

టీచర్: భూకంపాల బారినుండి తప్పించుకోవాలంటే మనం ఏం చేయాల్రా...?
స్టూడెంట్ : ఆకాశంలో నివాసాలేర్పరచుకోవాలి సార్.

ఏమో?

టీచర్ : ఆంగ్లేయులు మన దేశానికి ఎందుకు వచ్చార్రా?
విద్యార్థి : ఏమో మేడమ్ బహుశా మా తాత, నానమ్మ తాలూకూ బంధువులను చూడటానికి వచ్చారేమో!

బంగారం కావాలి!



ఉదయ్ : నాకు కేజీ బంగారం కావాలి..!
బంగారం వ్యాపారి : నీ దగ్గర అంత డబ్బుందా... కొనడానికి ?
ఉదయ్ : లేకపోతే దానిని అమ్మి అయినా ఇచ్చేస్తా ...
వ్యాపారి : దేనిని అమ్మి...?
ఉదయ్ : నీవు కేజీ బంగారం ఇస్తావుగా, దానిని...!

- ముత్యాల శ్రీశరత్‌బాబు, ఫోన్ నెం : 9963298921

నవ్వించే... చదివించే... 'కామిక్' కథానాయకులు

'బోర్' గా ఉంది. మనస్సులో ఏదో తెలియని వెలితి. జీవితంలో కాస్తంత నవ్వుంటే బోర్ బావురుమంటుంది. వెలితి తీరిపోతుంది. నవ్వుకోవాలి...మనసారా నవ్వుకోవాలి...కడుపుబ్బా నవ్వుకోవాలి... పొట్ట చెక్కలయ్యేలా నవ్వుకోవాలి. బాధను దరిదాపులకు కూడా రానివ్వని నవ్వును, నవ్వుకోవాలి. అంత బాగా ఎవరు నవ్విస్తారు ? ... మరేం ఫర్వాలేదు. అలా నవ్వించడానికి కొంత మంది ఉన్నారు. వారెవరంటారా... చాచా చౌదరి, ఫలూదా, షికారి శంబు వీరంతా నవ్వించేవారే. ఇంతకీ వీరెక్కడుంటారో చెప్పలేదు కదూ... అదే నండీ! వీరంతా కామిక్ కార్టూన్లు, నవలల్లో కథానాయకులు. వారిని పరిచయం చేసుకుందాం రండి!

చాచా చౌదరి

చాచా ని అందరూ ఇష్టపడతారు. ఎందుకంటే అతను చాలా తెలివిగలవాడు. సాహసాలు చేస్తాడు. క్లిష్టమైన చిక్కుముడులను కూడా చిటికెలో విప్పేస్తాడు. దుష్టులతో పోరాడతాడు. జనానికి సాయం చేయడంలో ముందుంటాడు. అటువంటి చాచాని ఎవరు మాత్రం కాదనగలరు ? 1971లో చిత్రకారుడు ప్రాణ్ కుంచె నుంచి జాలువారిన నవ్వుల నాయకుడే చాచా చౌదరి. పాదరసం లాంటి బుర్రతో ప్రజలకు సాయం చేస్తూ అందరి మన్ననలు పొందుతుంటాడు. ఇతనికి అన్ని విషయాల్లోనూ సాయం చేస్తుంటారు ఏలియన్ సాబు, పెంపుడు కుక్క 'రాకెట్'. ఇవి కాక తప్పకుండా చెప్పుకోవాల్సిన వారు మరొకరున్నారు. వారు ఎవరో కాదు చాచా భార్య. నోటి దురుసు తనం గల మనిషి. చాచా ఉపయోగించే ట్రక్కు కూడా ప్రత్యేకమైనదే. చాచా చౌదరి కామిక్ పుస్తకాలు లక్షలాది అమ్ముడయ్యాయి. చాచా కామిక్స్‌తో టీవీ సీరియల్ సైతం తీశారు. అందులో రఘువీర్ యాదవ్ చాచా పాత్ర పోషించారు.

సుపండి



ఇతను చూడ్డానికి వెర్రి వెంగళప్పలా ఉన్నా... చాలా నిక్కచ్చి మనిషి. చికాకు తెప్పిస్తాడు గానీ అత్యంత విశ్వాస పాత్రుడు. ఇతను చేసే పనులతో యజమానులకు నోట మాట రాదు. కాని చదువరులు మాత్రం కిందపడి దొర్లుతూ నవ్వేస్తారు. అతను చెయ్యలేని పని లేదు. కాకపోతే ఒక్క యజమాని దగ్గర పనిచేయడం మాత్రం అతని వల్ల కాదు. ఈ కామిక్ తొలిసారిగా 'టింకిల్'లో 1983లో అచ్చయింది.

డిటెక్టివ్ మూచ్‌వాలా

ఇతని పేరు చెప్పగానే గుర్తొచ్చే ప్రత్యేకతలు.... తిరగేసిన ఆంగ్ల అక్షరం'వి' లాంటి మీసాలు, తల మీద కొద్ది పాటి వెంట్రుకలు, బానపొట్ట, సన్నటి కాళ్లు ...... నేర పరిశోధనలో ఇతనికి మంచి పేరు ఉంది. నేరస్థులకు ముచ్చెమటలు పట్టించడంలో దిట్ట. నేరగాళ్లను పట్టుకోవడానికి అతని పెంపుడు శునకం పూచ్ బాగా సాయం చేస్తుంటుంది.

మూచ్ వాలా, అతని కుక్క పూచ్‌లు కలిసి కష్టతరమైన కేసులు కూడా పరిష్కరిస్తుంటారు. అంతా ఐతే అంతా అయ్యాక పోలీసులు రావడం భలే తమాషా. ఈ పాత్రలను 1980లో కార్టూనిస్ట్ అజిత్ నీనన్ రూపొందించాడు. అయితే 1990లో అనివార్య కారణాల వల్ల కామిక్ ఆగిపోయింది.

ఫలూదా

సృజనాత్మక సినీ దర్శకుడి బుర్రలో ఓ కార్టూన్ పాత్ర మెదిలితే ఎలా వుంటుంది ? అన్న దానికి నిదర్శనం ఫలూదా. సత్యజిత్‌రే చిన్నతనంలో 'షెర్లాక్ హోమ్స్' కథలు చదివేవాడు. ఆ ప్రభావంతోనే కొంత కాలం నేరపరిశోధన కథలూ రాసేవాడు. బెంగాలీ బాలల పత్రిక 'సందేష్'లో తొలిసారిగా1965లో ఫలూదా కనిపించాడు. నేర పరిశోధనలో చెయ్యి తిరిగినవాడు. దేశ వ్యాప్తంగా కేసులు పరిష్కరించేవాడు. ఒక్కోసారి విదేశాలు కూడా వెళ్లేవాడు. తన చిట్టి తమ్ముడు తపేష్ కూడా ఒక్కోసారి అతనికి సాయంగా వెళ్లేవాడు. నిజానికి ఫలూదా పాత్రతో చిన్ని కథలు వచ్చాయి. తర్వాత నవలలు వెలువడ్డాయి. ఆ తర్వాతే కామిక్స్ వచ్చాయి.

షికారి శంబు

నిజానికి ఇతడు అసలు వేటగాడే కాదు. ధైర్యవంతుడు అంతకంటే కాదు. వేటగాడిలా చేతిలో తుపాకీ, కళ్లను కప్పేసినట్టు కనబడే టోపీ, పొడవాటి మీసాలు ఇతని ప్రత్యేకత. ప్రమాదం నుంచి తప్పించుకోబోయిన ప్రతి సారీ హీరోగా గుర్తింపు పొందుతుంటాడు. షికారి శంబుకు జంతువులంటే మహా భయం. చిన్న , పెద్ద అనే తారతమ్యం లేకుండా చదువరులకు తెగ నవ్వు తెప్పిస్తుంటాడు.

బీర్బల్

మొఘల్ చక్రవర్తి అక్బర్ కు ముఖ్య సలహాదారుగా ఉన్న బీర్బల్ సమయస్ఫూర్తి, తెలివి తేటలు, నైపుణ్యాల గురించి కథల ద్వారా మనందరికీ సుపరిచితమే. మొదట కవిగా, గాయకుడిగా నియమితుడైన బీర్బల్ తర్వాత తన మేధాసంపత్తితో అక్బర్ చక్రవర్తికి అత్యంత సన్నిహితుడవుతాడు. వారి మధ్య జరిగినట్టుగా చెప్పబడే అనేక ఘటనలు ఎన్నో జానపద కథలకు మూల వస్తువైంది. అందులో బీర్బల్ హాస్య చతురత, విజ్ఞత రెండూ సమపాళ్లలో ఉంటుంది. అది పాఠకులకు హాస్యంతో పాటు నీతి కూడా అందిస్తుంది.

తెనాలి రామన్

దక్షణాదిలో మంచి పేరు ప్రతిష్టలు కలిగినవాడు తెనాలి రామన్. కృష్ణదేవరాయలు ఆస్థాన కవి. బీర్బల్‌లాగే ఇతను కూడా మంచి హాస్య చతురుడు. అద్భుతమైన తెలివి తేటలు కలవాడు. రాజ్యంలో పడుతున్న దొంగలకు బుద్ధి చెప్పడానికి తెనాలి రామన్ వేసే ఎత్తులు విపరీతమైన నవ్వు తెప్పిస్తాయి. గుర్తుతెచ్చుకొని నవ్వడానికి ఒకటి రెండు కాదు... ఇలాంటివి ఎన్నో .

◆ అట్టమీది కథ

నవ్వుల్ నవ్వుల్... పువ్వుల్ పువ్వుల్

పాత ఏడాదికి నవ్వుతూ వీడ్కోలు పలికాం. కొత్త ఏడాదికి నవ్వుతూ స్వాగతం పలికాం. అంతేనా... ప్రతి రోజునూ నవ్వుతూ గడుపుదాం! అప్పుడు జీవితమంతా నవ్వుల మయమే. ఆక్సిజన్ మనిషికి ప్రాణాధారం కావచ్చు కానీ నవ్వు అంత కన్నా ఎక్కువ. అందుకే...365 రోజులూ నవ్వండి! హాయిగా నవ్వండి! మనసారా నవ్వండి! నవ్వుతూ పలకరించండి! నవ్వుతూ మాట్లాడండి! నవ్వుతూ నవ్వించండి! నవ్వుతో ప్రపంచాన్నే గెలవచ్చని నిరూపించండి. అయితే నవ్వుల్లోనూ రకాలున్నాయ్. అవేంటో తెల్సుకుంటే ...నవ్వడం మరింత సులభం. ఆ విశేషాలేంటో ఈ వారం అట్టమీది కథలో తెలుసుకుందాం.

- జంధ్యాల రఘుబాబు

ఇవేమి సెల్లు ఫోనులా రకరకాలుండటానికి? యాండ్రాయిడ్, విండోస్, కీబోర్డ్, త్రీ జీ, ఫోర్ జీ ఇలా? అని అనుకోకండి. నవ్వుల్లోనూ మనం గ్రహించగలవి కొన్నే. తెలియనివి ఇంకెన్ని వున్నాయో.

"నవ్వులు రువ్వే పువ్వమ్మా నీ నవ్వుల్ని నాకు ఇవ్వమ్మా, ఉన్న నాలుగు నాళ్ళు నీలా ఉండిపోతే చాలమ్మా" అని ఓ కవి పాట రాశాడు. పువ్వుకైనా సరే నవ్వితే ఇంకొంత అందం వస్తుందని కవి భావన. అదీ నవ్వుకున్న పవర్.

"అతని మోము నవ్వుతున్న చంద్రబింబంలా" ఉందంటారే కాని "సూర్యగోళంలా" ఉందని ఎవ్వరూ రాయరు. అది కోపానికి రాయొచ్చు.

నవ రసాల్ని ఈమధ్య "నవ్" రసాలు గా రాసే వారున్నారు. అంటే నవ్వించే రసాలు అనుకోవాలి. "నవ్వుల్, నవ్వుల్" అన్న ప్రోగ్రాములు, "నవ్వితే నవ్ రత్నాలు" అన్న పుస్తకాలు చూస్తే నవ్వుకున్న విలువ తెలిసొస్తుంది. బాపు గారి నవరసాల బొమ్మలు చూడండి. వాటిలో "హాస్యము" అన్నదానికే మనం మార్కులెక్కువ వేస్తాము. ఈరోజు

నవ్వుల రోజని చెప్పటం కాదు, అందులో నిజం మీరే తెలుసుకోండి. ఏడ్పించటం ఎంత సులభమో నవ్వించటం అంత కష్టమని కళాకారులు చెబుతుంటారు. జంజీర్ లో అమితాబ్‌ను నవ్వించటానికి ప్రాణ్, అలాగే నిప్పులాటి మనిషైన ఎన్‌టీఆర్ ను నవ్వించటానికి సత్యనారాయణ ఎంత కష్ట పడ్డారో యూ ట్యూబ్‌లో చూడండి మీకే తెలుస్తుంది.

అమృతం, జబర్దస్త్, శేఖర్ సుమన్, కపిల్ షోలు, కామెడీ సర్కస్‌లూ ఇలా వీటన్నింటికీ నవ్వే ప్రధానం. ఎవరెవరి అవసరాలు ఎలా ఉన్నా, మొత్తం మీద ఇందరిని నవ్వించే వారిని మనం అభినందించాల్సిందే. లాఫింగ్ క్లబ్బులు, లాఫింగ్ థెరపీలు ఇవన్నీ నవ్వుల చుట్టూతా తిరిగేవే. ప్రపంచ "ఏడ్పుల దినం" అని ఫ్లెక్సీ పెట్టినా ఇదేదో నవ్వుల కార్యక్రమంలాగ ఉంది అని ఎందరో విరగబడి రావచ్చు. అదే నవ్వు పవర్. "మా ఏడుపంతా మిమ్మల్ని నవ్వించటానికేకదా!" అని ఓ సీనియర్ హాస్యనటుడు అనటం నవ్వించడం ఎంత కష్టమో మనకు తెలుపుతుంది. హాయిగా నవ్వుకోవాలంటే "ఆనందో బ్రహ్మ" లాంటి పాత టీవీ కార్యక్రమాలు చూడండి. హాస్య బ్రహ్మలైన దర్శకులూ మనకెందరో ఉన్నారు. ఒక్కొరిదీ ఒక్కో తరహా.

తన ఆటవిడుపుకోసం మనిషి ఈ నవ్వుపై ఆధారపడటం చూస్తే నవ్వు కొద్దిగా గర్వంగా ఫీలవచ్చు. సమస్త ప్రాణుల్లో నవ్వగలిగేది

మనిషొక్కడే. హైనా నవ్వుతుందంటారుగాని దాన్ని చూస్తేనే భయమేస్తుంది. కొన్ని పక్షులు నవ్వినా అది అనుకరణ మాత్రమే.

ఇవన్నీ చూస్తే నవ్వుల గురించి ఇంకా ఎన్నో విషయాలు తెలుసుకోవాలనిపిస్తుంది. తెలుసుకుందాం.

ఆదా (సగం)నవ్వులు

ఆదా అంటే సగం. అంటే పూర్తిగా కాదు అని అర్థం. కొందరేసే జోకులకు మనం నవ్వాల్సిందే, వచ్చినా రాకపోయినా. అవే ఆదా నవ్వులు. అక్కడ సగం నవ్వు, సగం మన అవసరం ఉంటాయి. ఆ మాత్రం మన మొహం నవ్వినట్టు కనబడకపోతే మన పని కాదు. మన ఫైలు పైన సంతకం కాదు.

పెండింగు గుట్టలోకి వెళ్ళిపోతుందది.

వీటిని ఎక్కడికక్కడ ఉప తరగతులుగా విభజించుకోవచ్చు. బాస్ దగ్గరున్నప్పుడు "బాస్ నవ్వులు" లేదా "బాస్ కోసం నవ్వులు". ఆయనో క్యాంపుకు పోయొచ్చి ఉంటాడు. అక్కడ జరిగినవి చెబుతుంటాడు. మనం "వహ్వా, వహ్వా" అనాలి, ఖవ్వాలీ కార్యక్రమంలో లాగ. మధ్యలో తన గొప్పతనం చెబుతాడు. ఎవరో తనను తిట్టినవి ఇంకొకరి మీద వేసి చెబుతాడు. "వహ్ ఉస్తాద్" అనాల్సిందే. అక్కడ తనను కడిగినదంతా తాను కడిగినట్టు చెబుతాడు. అవును సార్, మీరు అబ్బాస్ లాగా నీలి, ఎరుపు రెండు రంగుల్లోనూ కడుగుతారు అని నవ్వు మొహం పెట్టాలనిపిస్తుంది. ఆయన్ని మన నవ్వుతో ఆమాత్రం ఆనందపడేలా చేయకపోతే మనకు తరువాత మిగిలేది ఒకటే, నవ్వుకు వ్యతిరేకార్థం.

బడ్జెట్ నవ్వులు

బడ్జెట్ ప్రవేశపెడతారు, లోక్ సభలో. గంటలు గంటలు ఆర్థిక మంత్రి దాన్ని చదవలేక, కర్చీఫ్ తో మొహం తుడుచుకుని, అదీ చాలక మధ్యలో మొహం కడుక్కొని ఎలాగోలా దాన్ని పూర్తి చేస్తాడు. నవ్వుతూనే. ప్రధాన మంత్రి తన సీట్లో కూచొనే చిద్విలాసంగా నవ్వుతుంటాడు "ఏదో తానే రాసినట్టు ఫీలవుతున్నాడు" అనుకుంటాడు మదిలో.

ఎదురుగా కూచున్న ప్రతిపక్ష నేత ఓ వ్యంగపు నవ్వు నవ్వుతాడు. ఇంకో యువ నేత మధ్యలో నిద్ర లేచి ఏమీ అర్థం కాక నవ్వుతాడు, అందరూ నవ్వుతుంటే.

ఇవన్నీ టీవీలో చూస్తున్న ఫిక్కీ, చేంబర్ ఆఫ్ కామర్స్ వాళ్ళు, అంబానీలు, టాటాలు కూడా నవ్వుతారు. తమకోసం రాసిన ఆ బడ్జెట్లో ప్రజలకు సంబంధించిన పదజాలం ఎంత బాగా రాశారు. నిజంగా రాజకీయ నాయకుల్లో ఇంత మంచి కవులున్నారా! అని నవ్వుకుంటారు.

ఉదయాన్నే పేపర్ చూసిన సామాన్యుడు కంప్యూటర్లు, కార్లు, విమాన చార్జీల ధరలు తగ్గటం ఉప్పు పప్పు బియ్యం ధరల గురించి ఆ బడ్జెట్లో ఊసే లేకపోవటం చూసి హు అని ఆ సామాన్యపు నవ్వు నవ్వుతాడు

విలనీ నవ్వు, హీరో నవ్వు

మన సినిమాల్లో హీరో నవ్వు ఒక విధంగా, విలన్ నవ్వు ఇంకో విధంగా ఉంటాయి. కాదు ఉండాలి. గత కొన్నేళ్ళుగా కొత్త నటులు, దర్శకులు, అసలు కొత్త ప్రేక్షకులూ రాబట్టి ఇంకొన్ని కొత్త నవ్వుల్ని చూస్తున్నాం. ఇప్పుడు విలన్ కసాయి వాడిలా నవ్వాల్సిన పనిలేదు. హీరో రాజసంతో కూడిన నవ్వు నవ్వక్కరలేదు. విలన్ కూడా "ఇది పెన్ననుకున్నావా, గన్ను అనొచ్చు". ఎస్వీ రంగారావుగారి నవ్వు ఒకరకంగా ఉంటే అంతే విలనీగల రావుగోపాలరావుగారి నవ్వు ఇంకో విధంగా ఉంటుంది. హీరో పాత్రలేసే నటుడు విలన్ వేస్తే ఒక విధంగా, ప్రతినాయకుడి పాత్రలేసే అతను హీరో అయితే అంతా కలగలసిపోయిన నవ్వులను చూడొచ్చు. ఇక ద్విపాత్రాభినయంలో ఒక్కోకరికీ ఒక్కో నవ్వు నవ్వి, "ఈ సినిమా షూటింగు ఎప్పుడయిపోతుందిరా నాయనా" అనుకునేలా కూడా వుండొచ్చు.

సభా నవ్వులు

మన చట్టసభల్లో కెమెరాలుంటాయి. మనం లైవ్‌గా కూడా చూడొచ్చు. అందుకని నాయకులు మంచి బట్టలే కాదు. నవ్వుతూ కనబడాలి. ప్రతిపక్ష నాయకుడు ఎన్నో విమర్శలు చేస్తుంటాడు. ఇది దరిద్రపుగొట్టు ప్రభుత్వమంటాడు. అయినా ముఖ్యమంత్రి నవ్వుతూ ఉంటాడు. అధ్యక్షా ఈ నవ్వుకు అర్థమేమిటి అధ్యక్షా అని అడుగుతాడు. అధికారంలో ఉన్నవాడి నవ్వు లేనివాడికి ఏడుపు అనుకోవచ్చు పగలూ రాత్రి లాగ. సభలో ఒక్కోసారి నవ్వించేవారు, అవతలవారిని ఆటపట్టించేవారూ ఉంటారు. ఒక్కోసారి ఏదో

గ్యాస్ నవ్వులు

ఏదో ఒక గ్యాస్ చెబితేగానీ నవ్వురాదు. ఎక్కడో జరిగింది జరిగినట్టుగా చెబితే నవ్వు రాకపోవచ్చు, అప్పుడు దానికి గ్యాస్ జోడించాలి. ఇక మిగిలింది నవ్వులే.

"ఏరా క్లాసుకు లేట్‌గా వచ్చావ్?", భయం నటిస్తూ "మధ్యలో పోలీసు పట్టుకున్నాడు సార్, మీ క్లాసుందని చెబితే వదిలేశాడు" అని క్లాసులో అందరూ వినేలా చెప్పిన కుర్రాడికి ఏ శిక్ష విధించాలి? అదే మనం కలపగల గ్యాస్!

గ్యాసా, నవ్వులా అనుకోకండి. సబ్సిడీ ఎత్తేస్తారు, ఏడాదికి వాటి సంఖ్యను తగ్గిస్తారు ఇంకా నవ్వులేమిటండీ బాబూ అనుకోకండి. ఇది ఆ గ్యాస్ కాదు. నవ్వించే గ్యాస్ అని ఒకటుంది. దాన్నే "లాఫింగ్ గ్యాస్" అంటారు. దాని పేరు నైట్రస్ ఆక్సైడ్. రెండు నైట్రోజన్ అణువులు, ఒక ఆక్సిజన్ అణువు ఉంటాయందులో. నిజంగానే దానివల్ల నవ్వు వస్తుందా అంటే వస్తుంది. ఆ వాయువు పీల్చినప్పుడు శరీరం బాగా రిలాక్స్ అయిపోతుంది. మనిషి హాయిగా ఉన్నప్పుడు నవ్వే కదా వచ్చేది? అసలు ఓ హాస్య సినిమా తీసి, అందులో నవ్వు ఉన్నా లేకపోయినా థియేటర్లో అప్పుడప్పుడూ ఈ నవ్వించే గ్యాస్ వదిల్తే సరి. అందరూ నవ్వుకుంటూ బయటికొస్తారు. ఒకటే నవ్వులండీ అని బయట టీవీ చానెల్ వాళ్ళకు చెబుతారు. ప్రచారాలకు డబ్బూ ఆదా అవుతుంది. అప్పుడు "ఆదా" నవ్వులు నవ్వుకోవచ్చు.

కామెడీ నవ్వు... ట్రాజిడీ నవ్వు

ఇవి సినిమాలవేనని ఇప్పటికే అర్థమైపోయుంటుంది. కొందరు ఏడిస్తే మనకు ఏడుపు రాకపోగా నవ్వొస్తుంది. అందుకే వారి ఏడుపుగొట్టు సీన్లని స్లో మోషన్లోనో, వెనుకనుంచో చూపాలి. లేదా నెగెటివ్‌గా చూపాలి. అప్పుడు నవ్వో ఏడుపో తెలియదు. ఇక కామెడీ చేసే వారు కనుక సరిగా చేయకపోతే అది నవ్వుకు బదులు ఏడుపొస్తుంది. నవ్వించకపోగా నవ్వుల పాలు చేస్తుంది. కళ్ళతోనే నవ్వించే నటులు పోయి మాటలతో నవ్వించేవారొచ్చారు. తరువాత మాటలతోపాటు నవ్వుతూ నవ్వించారు. అదీ చాలక నవ్వు, ఏడుపూ కలగలిపి నవ్వించారు. ఇప్పుడు నవ్వించేవాడిని కొట్టి మరీ ప్రేక్షకుల్ని నవ్విస్తున్నారు. ఇంక రాను రాను చక్కిలిగింతలు పెట్టి మరీ నవ్వించే ప్రయత్నం చేస్తారేమో చూడాలి. ఆ విధంగా కామెడీ తన మార్గాన్ని వదిలి ట్రాజెడీ మార్గంలో ఉందేమో?

తెనాలి రామలింగడి నవ్వుల కథలు, బీర్బల్ కథలు, ముల్లా నస్రుద్దీన్ కథలు, పరమానందయ్య శిష్యుల కథలు ఇలాంటివెన్నో నవ్వుతో పాటు మనిషికి ఎన్నో విషయాలను బోధిస్తాయి. వాటిని ఆధారం చేసుకుని తయారైన పాత్రల్నే మనం ఇంకో రూపంలో చూస్తున్నాం.

చెప్పబోయి ఎక్కడో తేలే చర్చలకు, ప్రజల సమయం వృధా అవుతున్నందుకు మనం ఓ వైరాగ్య నవ్వు నవ్వుకోవాలి, తప్పదు.

దగ్గు నవ్వులు

వీటిని నవ్వు దగ్గులు అని కూడా అనవచ్చు. ఎందుకంటే కొందరికి నవ్వీ, నవ్వీ ఊపిరితిత్తుల్లోని గాలంతా ఐపోయి దగ్గు మొదలవుతుంది. అవతలి వారు నవ్విస్తూనే ఉంటారు. ఇక నవ్వే శక్తిగానీ, ఆక్సిజనుగానీ ఉండవు. మిగిలింది దగ్గే. దగ్గుతో పాటు మధ్య మధ్యలో నవ్వు కలిసి ఉంటుంది. జాగ్రత్తగా కనిపెట్టాలి. ఆస్తమా నవ్వులు, పొడిదగ్గు నవ్వులు, నాన్ స్టాప్ దగ్గుతో ఓ పక్క బీడీనో, సిగరెట్టో పీలుస్తూనే తమ పని తాము చేస్తుంటారు కొందరు. సినిమా పరంగా చెప్పాలంటే వీరి కోసం యమభటులు కూడా నవ్వుతూ ఎదురు చూస్తుంటారు. వీరి నవ్వునాపటానికి పబ్లిక్ ప్రదేశాల్లో ధూమ పానం నిషేధించినా దాన్నీ నవ్వులపాలు చేస్తున్నారు నవయుగ గిరీశాలు. నూటా యాభై సంవత్సరాల పూర్వమే "పొగతాగనివాడు దున్నపోతై పుడతాడని" గిరీశం చేత చెప్పించిన మహా కవికి జోహార్లు. అలా పొగ తాగే వాళ్ళే ఆ అవతారంలో ఉన్నారని తాగనివాళ్ళు అనొచ్చు. ఎవరి ఆనందం వాళ్ళది. మనం కాదనకూడదు. ఎవరు మనిషో ఎవరు ఇంకోటో ఊపిరితిత్తుల డాక్టర్ చెబుతారు భవిష్యత్తులో.

క్రూరపు... విషపు నవ్వులు

అసలు నవ్వంటేనే పరిశుద్ధమైనదని, అందులో ఇతరరేతరమైన భావాలు ఉండవని, ఉంటే గింటే వ్యంగ్యం ఉంటుందనుకుంటాం. అక్కడే మనం ఎక్కడో కాలువేశామని అర్థం చేసుకోవాలి. నవ్వుల వెనుక క్రూరత్వం, విషం దాగి ఉంటాయని ఇప్పటికే చాలామంది నిరూపించారు. చూడ్డానికి వారు నవ్వేది నవ్వే, కాని అది నవ్వు కాదు.

శకుని, శల్యుడు ఈ కోవలోకి వస్తారు. శకునిమామ క్రూరపు నవ్వు పాండవులమీదేమోననుకుని పొరబడ్డ దుర్యోధనుడు తన పరిస్థితి చూసి తానే నవ్వుకుంటాడు చివర్లో. అది రికార్డు చేయలేదు మనవారు. అలాగే కర్ణుడిపై శల్య సారథ్యం వ్యంగంతో, విషంతో సాగి చిరస్థాయిగా నిలిచిపోయింది. కొత్తాదేవుడండీ అని సైతాను వేషంలో నూతన్ ప్రసాదు నవ్వింది ఈ తరహా నవ్వుల్లోకి తీసుకోవచ్చు.

పౌరాణిక నవ్వులు

మన నవ్వులు ఇతరులకు నవ్వు తెప్పించటమే కాదు ఒక్కోసారి కోపం తెప్పిస్తాయి. శత్రువులను చేస్తాయి. మిత్రులను తాత్కాలికంగానయినా గుర్రుగుర్రుగా చూసుకునేలా చేస్తుంది ఈ నవ్వు. వాటిని సందర్భ, అసందర్భ నవ్వులుగా మళ్ళీ వర్గీకరణ చేయొచ్చేమో.

భార్యను వదిలి, అడవిలో తిరుగుతూ అన్నా వదినలకు సేవ చేసుకుంటూ, రావణున్ని సంహరించి వచ్చాక అన్నకు పట్టాభిషేకం జరుగుతూ ఉంటే లక్ష్మన్నకు నిద్ర ముంచుకొచ్చింది. ఇన్నిరోజులూ లేనిది ఇప్పుడొచ్చిన నిద్రను తలచుకుని సింపుల్‌గా ఓ నవ్వు నవ్వుతాడు సౌమిత్రి. అదేదో లోలోన నవ్వుకుని వుంటే మనం ఇప్పుడు చెప్పుకునే పనే లేదు, రాదు. ఆయన ముసి ముసిగా బయటకే నవ్వేశాడు. ఎలా నవ్వింటాడో కాంతారావు, శ్రీకాంత్ నవ్వినట్టు ఊహించుకుందాం. అది చూసిన ఒక్కొక్కరూ ఒక్కో విధంగా తమగురించే అనుకుని కోప్పడతారు అన్నా, వదినలతో సహా. ఇక హనుమంతుడు కూడా తన గురించే అనుకుంటాడు. ఎందుకంటే అది అసందర్భపు నవ్వు కాబట్టి. అప్పుడు తన నిద్ర, నిద్రా దేవి కథ చెబుతాడు లక్ష్మణుడు. అదంతా చెప్పుకుంటే "నవ్వుల్ని" వదిలేసి "నిద్ర"కు పోవాలి.

ఇక మయసభ సీను. నీటిలో పడ్డ పునీత్ ఇస్సార్‌ను చూసి రూపా గంగూలి జమునలా నవ్వుతుంది. అదే దుర్యోధనుణ్ణి చూసి ద్రౌపది నవ్వుతుంది. తరువాతి విషయాలు అందరికీ ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులకి తెలుసు. అందుకే ఈ నవ్వుతో జాగ్రత్తగా ఉండాలి.

మార్కెటింగ్ నవ్వులు

ఓ పెద్ద మార్కెటింగ్ మేనేజరు తండ్రి పోయాడు. ఏదో తనకున్న సమయంలో ఆ కార్యక్రమాలు కానిద్దామని చేస్తూ ఉంటాడు. అది

ఆదివారమైందని కొద్దిగా బాగానే చేస్తుంటాడు. ఇంతలో కొత్తగా చేరిన మర్కెటింగ్ కుర్రాడు నవ్వు మొహంతో వచ్చి బాస్‌ని పలకరించి బొకే ఇస్తాడు. బొకే నాక్కాదయ్యా అని అదెక్కడ పెట్టాలో చూపుతాడు. నవ్వుతూనే పెడతాడు బొకే. అతణ్ణి పక్కకి పిలిచి "ఆ నవ్వు మొహమేంటయ్యా?" అని అడుగుతాడు. "మీరే కద సార్ ఈ రంగంలో నవ్వుతూ ఉంటేనే పనులవుతాయని సెలవిచ్చారు. అందుకే ఎప్పుడూ నవ్వుతూనే ఉండటం అలవాటు చేసుకుంటున్నాను" అన్న సమాధానానికి ఆయనా కొద్దిగా నవ్వుతాడు.

మన నవ్వు మార్కెట్లో సగం విజయాన్ని సాధిస్తుంది అన్న మొదటి సూత్రంతో పాటు ఇంకొన్ని కిటుకులూ చెబితే మేలేమో. లేదంటే నవ్వు నాలుగు విధాల........ అవుతుంది.

"స్వెటర్ ఎంత?" అని అడుగుతాడు వినియోగదారుడు. స్వెటర్లవాడు "వెయ్యి" అని నవ్వుతాడు. అటూ ఇటూ చూసి ఎవ్వరూ, ముఖ్యంగా లేడీస్ లేరని మూడువందలకు అడుగుతాడు. ఆరువందలకు తీసుకొమ్మంటాడు. సరేనని నాలుగు వందలు తగ్గించి తీసుకున్న ఆనందంలో ఈయన నవ్వితే, రెండువందలు ఎక్కువకు అమ్మినందుకు అమ్మేవాడూ నవ్వుతాడు. మొత్తం మీద ఇద్దరూ నవ్వుతారు. మనకు కావలసింది అదే. సర్వే జనా...

మిమిక్రీ నవ్వులు

మిమిక్రీ ఆర్టిస్టులు ఈ నవ్వులపై కూడా ప్రయోగాలు చేశారు. సోడా గ్యాస్ నవ్వులు, గుర్రపు సకిలింపు నవ్వులు, సడెన్ బ్రేక్ శబ్దం నవ్వులు, ఒక్కసారి పై స్వరంలోకి పోయి అక్కడే ఆగిపోయే నవ్వులు (ఈయన ఉన్నాడా పోయాడా అనుకునేంత), విలన్ నవ్వులు, హీరో నవ్వులు ఇలా ఎన్నెన్నో రకాలు చూపిస్తారు. మనం ఒకదాని గురించి నవ్వుతుండగానే ఇంకొకటి మొదలుపెట్టేసి మన ఊపిరి తిత్తులను శుభ్రం చేసేస్తారు. ఒకరి మాదిరి మాట్లాడ్డమే కాదు వారి పాత్రల స్వభావాన్నిబట్టి మాటల తూటాలతో ఎన్నో కార్యక్రమాల్ని చూడొచ్చు. నాకు నవ్వటం రాకపోయినంత మాత్రాన నన్ను తక్కువచేస్తారని వాటిని ఆపేయగల శక్తి అందరికీ ఉండదు. "కాదేదీ" అన్నట్టు నువ్వేది చేసినా దాన్ని నవ్వు రూపంలో పెట్టగల దిట్టలున్నారీ భూమిపైన అని గుర్తించాలి.

సైన్సు సోషల్ నవ్వులు

"సార్ మీ అబ్బాయి, మా అమ్మాయి చాలా సోషల్‌గా తిరుగుతున్నారు" అని పక్కింటాయన చెబితే మావాడికి చీవాట్లేస్తాలెండనో, ఇంకోటో చెబితే నవ్వు రాదు దాన్నే కొద్దిగా మార్చి "సోషల్ వరకైతే ఫరవాలేదు, సైన్సువరకు పోకుండా చూసుకోండి" అంటే ఆ సీను వేరుగా ఉంటుంది. సోషల్ జోక్స్, సైన్సులో సరదాలు లాంటివి కూడా మనం చూడొచ్చు. అసలు సందర్భాలను విడగొట్టి రక రకాల జోకుల పుస్తకాలు మనం చూడొచ్చు. సైన్సు ఆధారంగా, సైన్సుకోసం చేసిన ఉపగ్రహాలను పూజలతో పైకి సాగనంపటం, వాటి నమూనాలను గుళ్ళలో దేవుడి విగ్రహం ముందు సమర్పించటం చూసి మనం ఓ "విధ్యావాద సైన్సు" నవ్వు నవ్వుకోవాలి. మానవుణ్ణి ఎంతో ఎత్తుకు తీసుకెళ్ళిన తనను ఇంతటి స్థాయికి దించిన ఈ తరహా మానవుల్ని చూసి సైన్సు ఏమనుకుందో. తనకే నవ్వగల శక్తి ఉంటే ఎలా నవ్వేదో ఊహించుకుంటేనే నవ్వొస్తుంది.

శుభ్రతా నవ్వులు

పచ్చదనం పరిశుభ్రతలు, స్వచ్ఛ, శుద్ధ

భారత్‌లు ఎన్నెన్నో చూసి బండబారిన గుండె మనది. వాటివల్ల ప్రయోజనం శూన్యం అనేవారు, శూన్యంలోనుండే విశ్వం పుట్టిందనేవారు రోడ్లెక్కి అరుచుకునే రోజులు దగ్గర్లో ఉన్నాయి. అవి కనబడకుండా చీపురు పట్టుకుని కొట్టే వారు, కొట్టినట్టు నటించేవారు మనకు నవ్వుతూ దర్శనమిస్తారు ఫోటోల్లో. ఆ నవ్వులు చూసి మీరేమీ అనుమానపడకండి, అసలు అక్కడ చెత్తలో మొహానికి కనీసం గుడ్డైనా వేసుకోలేదు, అసలు అది నిజమైన చెత్తేనా అన్న చెత్త అనుమానాలు తెచ్చుకోవద్దు. వాళ్ళ నవ్వుల్ని మాత్రం ఆస్వాదించండి. మీరూ నవ్వుతూ ఉండండి. దేశానికి మంచిదో కాదో కాని ఆరోగ్యానికి మాత్రం నవ్వు మంచిది.

ఇతరులను నవ్వించటం, ఇతరులు సుఖంగా ఉండాలని కోరుకోవటం మన సంస్కృతి. ఎవరినీ ఏడిపించకుండా దాన్ని కాపాడుకుంటే చాలు, నవ్వినట్టే లెక్క. నవ్వించినట్టే లెక్క.

అసలు ఇవేనా ఇంకెన్నో రకాల నవ్వులు ఉంటాయి అనొచ్చు ఎవరైనా. కచ్చితంగా ఉంటాయి. రోజులు మారుతున్నాయి మనిషి అవసరాలు మారుతున్నాయి, పరిసరాలు మారుతున్నాయి. ఎవరెన్ని చేసినా, చెప్పినా కాస్త నవ్విస్తే చాలు మనకి. వెలుగుతున్న దీపం లాగా నవ్వే మనిషే ఎవరినైనా నవ్వించగలడు. అలాగే సీరియస్‌గా ఉన్న మనిషిమీద జోకులేసుకునైనా నవ్వుతారు జనం. కాబట్టి ఈ నవ్వోపరిషత్తు అలా అలా కొనసాగనివ్వండి నవ్వుతూ.

◆

ప్రేమ... విప్లవం...

◆ సీరియల్

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

(భాగం -18)

పారిస్, 1848

తరువాతి రోజుల్లో రెండు వందల ప్రపంచ భాషల్లోకి అనువాదమయిన కమ్యూనిస్ట్ మేనిఫెస్టోను, అది తొలిసారి ప్రచురితమయినప్పుడు ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఇంచుమించు అందరూ దాన్ని విస్మరించారు. అప్పటికే యూరోప్ భగ్గుమంటోంది. 1848, ఫిబ్రవరి మూడోవారంలో, పారిస్‌లో రాజకీయ భూకంపం వచ్చిందన్న పుకార్లు బ్రసెల్స్‌లో వ్యాపించాయి. – నమ్మశక్యం కాని వదంతులవి. "అధికారం వదులుకుని, దేశం విడిచి వెళ్ళిపోయాడు లూయీ ఫిలిప్" ఫ్రాన్సులో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఫ్రాన్సు యిప్పుడు ప్రజాస్వామ్య దేశం!" గురువారం, ఇరవై నాల్గవ తేదీ నాడు పారిస్ నుండి రావలసిన రైలు కోసం నిరీక్షిస్తూ బ్రసెల్స్ రైల్వే స్టేషన్ జనంతో కిటకిటలాడింది. తను ఏ ప్రభుత్వానికి ప్రతినిధిగా ఉండాలో తెలుసుకోవటానికి, వార్తల కోసం, ఫ్రెంచి రాయబారి కూడా అక్కడికి వచ్చాడు. శుక్రవారం నాడు అర్ధరాత్రి తర్వాత పొగలు కక్కుతూ వచ్చింది రైలు. అదింకా ఆగకముందే "అంతటా ఎర్రజెండాలు ఎగురుతున్నాయి. రిపబ్లిక్‌గా ప్రకటించారు" అంటూ ప్లాట్‌ఫాం మీదికి దూకాడు డ్రైవర్. జనం ఒక్క పెట్టున 'ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు. ఆ నినాదాలు చేసిన వారిలో ఎక్కువ మంది జర్మనులే. ఫ్రెంచి రాయబారి భార్యతో సహా నెమ్మదిగా జారుకున్నాడు. త్వరలోనే, యూరోపియన్ రాజధానులన్నింటిలోనూ మార్మోగింది ప్రజాస్వామ్య నినాదం. ఒకప్పుడు అజేయమనుకున్న రాజరికాలు పేకమేడల్లా కూలిపోయాయి. పోనీ, వీళ్లందరూ శత్రుదేశాలతో యుద్ధాలలో పరాజితులయినారా అంటే అద కాదు. సామాన్య ప్రజలు – కేవలం సంఖ్యాబలంతో దైవాంశ సంభూతులైన తమ ప్రభువులను గద్దెదించారు.

" పారిస్ విప్లవంతో మార్క్స్ ఇంట్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. మార్క్స్, అతని స్నేహితులు అనేక వేల మందితో ఒక ప్రదర్శన...డెమానుస్ట్రేషన్‌కు పిలుపునిచ్చారు. సన్నాహాలు చురుగ్గా జరిగాయి. ఆ రాత్రి ప్రదర్శనకు జనం బాగానే తరలివచ్చారు. 'మార్క్స్' గీతాలు ఆలపించారు. ' ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి ' అంటూ నినాదాలు చేశారు. సివిల్ పోలీసులు, ప్రదర్శనలను అదుపు చెయ్యడానికి ప్రయత్నించారు. జనంలో అలజడి ప్రారంభమైంది. "స్వేచ్ఛ, సమానత్వం" అన్న నినాదాలు మిన్నంటాయి. "

ఒక చరిత్రకారుడు రాసినట్టుగా, "చరిత్ర సమస్యల్ని పరిష్కరించదు. వాటినది మందుపాతర్లలాగా దాడిపెడుతుంది." 1848లో యురోప్‌లోని పరిస్థితి ఇదే.

నెపోలియన్ విజయయాత్రల జ్ఞాపకాలు చెరిపేయటమే లక్ష్యంగా 1815లో యూరోప్ పునర్విభజన జరిగింది. కాని జనాభాలననుసరించి జరగలేదు. పైగా కొత్తగా పగ్గాలు చేపట్టిన ప్రభువులు బలహీనులు. ప్రజలకు పన్నుల భారం పెరిగింది. యుద్ధాలలో పాల్గొన్న సైనికులకు అదనపు లాభాలేమీ ఒనగూరలేదు. ఇదీగాక ప్రకృతి వైరీత్యాలు. పంటలు నాశనమైనా రైతులకు పరిహారం లభించలేదు. నిరుద్యోగ సమస్య పెరిగింది. ఇలాంటి అనేక ఇతర సమస్యలు కలిసి 1848లో సంభవించింది

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి

విస్ఫోటనం. యూరోపియన్ ప్రజానీకం, తమ పాలకులకు వ్యతిరేకంగా చేసిన తొలి తిరుగుబాటది.

ఈ విప్లవానికి కేంద్ర బిందువు పారిస్. ఒక రకంగా ఈ గొడవలు 1847 చివరలోనే ప్రారంభమయ్యాయి. మొదట స్విట్జర్లాండు, వేరు పడాలనుకున్న ఏడు ప్రాంతాలమీద యుద్ధం ప్రకటించింది. పక్కనే ఉన్న ఆస్ట్రియాలో చాన్సలర్ మెట్టర్‌నీష్ కూడా ఈ వేర్పాటువాద రాడికల్స్‌కు వ్యతిరేకంగా పావులు కదిపాడు.

క్రమేణా స్విస్ తిరుగుబాటు (ఇటలీలోని) పాలెర్మోలో కొనసాగింది. 1848 జనవరిలో ఆహార కొరతతో సిసిలీలో అల్లర్లు చెలరేగాయి. అలా చిలికి చిలికి గాలివానగా మారి విప్లవం ఫ్రాన్సుకు చేరుకుంది. కాని అక్కడి లూయీ ఫిలిప్ మూర్ఖుడు "చలికాలంలోవెవ్వరూ విప్లవం చెయ్యరు. వేసవి కాలం దాకా ఆగుతారులే" అనుకున్నాడు.

ఒక సంవత్సర కాలంగా ఫ్రెంచి ప్రతిపక్ష సభ్యులు ఎన్నికల, రాజకీయ సంస్కరణల కోసం ఆందోళన చేస్తున్నారు. అప్పటికి ఓటు వెయ్యాలంటే 200 ఫ్రాంకులు ఓటింగ్ పన్ను కట్టాలి. దేశంలోని 'ధనిక' వృత్తి నిపుణుల ఆదాయం కూడా 600 ఫ్రాంకులకు మించదు. అంటే, 90 లక్షల పురుష ఓటర్లలో రెండున్నర లక్షల మంది మాత్రమే ఓటు వెయ్యగలరన్నమాట.

రాజకీయ సమావేశాల మీద ఉన్న నిషేధాన్ని అధిగమించటానికి (రాజకీయ చర్చల్లో ఆరు కన్నా ఎక్కువ మంది ఉండకూడదు) విందులు ఏర్పాటు చేశారు. ఇలాంటి తొలి విందులో 1200 మంది పాల్గొన్నారు. ఆ తర్వాత దేశమంతటా మరో 22 విందులు జరిగాయి. క్రమంగా 'రాజకీయాల్లో' రాడికల్ స్వరం బలపడింది. అప్పటికి ఎంగెల్స్, "దిగువ వర్గాల వాళ్ళు ప్రతిపక్షాలతో చేతులు కలపటానికి సిద్ధంగా ఉన్నారని" ఒక వ్యాసం ప్రచురించాడు. "రాజు గారు, బ్యాంకర్లకూ, స్టాక్ బ్రోకర్లకూ, రైల్వే పెట్టుబడిదార్లకూ, పెద్ద పారిశ్రామికవేత్తలకూ, ఖనిజ వ్యాపారస్తులకూ సేవకుడు."

ఫిబ్రవరి 22 నాడు పారిస్‌లో మరో విందు ఏర్పాటు చేశారు. రాజుగారు ఈ విందుల్ని అంత సీరియస్‌గా తీసుకోలేదుగాని ఆయన ప్రధానమంత్రి ఫ్రాంస్వా గైజో – ఇది విపత్పరిణామాలకు దారితీస్తుందని గ్రహించి దీనిమీద నిషేధం విధించాడు. కాని అప్పటికే అక్కడికి చేరిన జనం లొంగిపోవటానికి సిద్ధంగా లేరు. విపరీతమైన చలినీ, వర్షాన్నీ ధిక్కరించి వాళ్ళు "డౌన్ విత్ గైజో" అంటూ నినాదాలు చేశారు.

రోజు గడిచింది. మంచు వర్షం కురిసింది. మంచు సూదులుగా మారి జనాన్ని గాయపర్చింది. అయినా, జన సందోహం పెరిగిందే తప్ప తగ్గలేదు. చెదరగొట్టటానికి ఎనభైవేల మంది నేషనల్ గార్డ్ – సాయుధ పోలీసులు వచ్చారు. కాని వాళ్ళకూ, నేషనల్ గార్డ్‌కూ రాజు మీద కోపంగానే ఉంది. తుపాకులు కిందికి దించి నిరసన కారులలో కలిసిపోయారు. హర్షధ్వానాలతో ప్రతిధ్వనించిందా సమావేశ ప్రాంగణం. 'గైజో ముర్దాబాద్' నినాదాలు మిన్నంటాయి.

లూయీ ఫిలిప్‌కు అలసటగా వున్నట్టుంది. గోల ఏమిటో అర్థం కాలేదు. గైజోను డిస్‌మిస్ చేశాడు. ఈ నిర్ణయం నిరసన కారుల్ని తృప్తిపరుస్తుందని కూడా ఆశించి వుంటాడు. కాని సాయంత్రం వరకు వీధుల్లో ఆందోళనకారుల సంఖ్య పెరిగింది. పోలీసు కాల్పుల్లో యాభై మంది (కొందరు ఎనభైమంది అన్నారు) మరణించారు. నిరసనకారులు మృతదేహాలను బళ్లలో ఊరేగించారు. ఆ దివిటీల వెలుగులో,

" రాజకీయ సమావేశాల మీద ఉన్న నిషేధాన్ని అధిగమించటానికి (రాజకీయ చర్చల్లో ఆరు కన్నా ఎక్కువ మంది ఉండకూడదు) విందులు ఏర్పాటు చేశారు. ఇలాంటి తొలి విందులో 1200 మంది పాల్గొన్నారు. ఆ తర్వాత దేశమంతటా మరో 22 విందులు జరిగాయి. క్రమంగా 'రాజకీయాల్లో' రాడికల్ స్వరం బలపడింది. అప్పటికి ఎంగెల్స్, "దిగువ వర్గాల వాళ్ళు ప్రతిపక్షాలతో చేతులు కలపటానికి సిద్ధంగా ఉన్నారని" ఒక వ్యాసం ప్రచురించాడు. "

ఇనుపచక్రాల చప్పుడు నగర నిశ్శబ్దాన్ని భగ్నం చేసింది. ఆ రాత్రి యింకెవ్వరూ నినాదాలు చేయలేదు. విప్లవగీతాలు గానం చెయ్యలేదు. కాని నిశ్శబ్దం భయానకం.

ఆ రాత్రి పారిస్‌లో ఎవరూ నిద్రపోలేదు. నిరసనకారులూ, రాజుగారు మాత్రం ఖచ్చితంగా నిద్రపోలేదని చెప్పవచ్చు. రాత్రంతా బారికేడ్లు కట్టారు. రోడ్ల మీద పరచిన పదిలక్షల రాళ్ళు పెకలించి, నాలుగు వేల చెట్లు నరికి, సైనిక దాడులను ఎదుర్కోవటానికి వ్యూహాత్మక నిర్మాణాలు చేపట్టారు. కాని ఉదయం వరకు, సైన్యం కూడా నిరసనకారులతో కలిసిపోయింది. ఫిబ్రవరి 24 నాడు లూయీ ఫిలిప్ స్వచ్ఛందంగా గద్దె దిగి ఇంగ్లండ్‌కు పారిపోయాడు. ఫ్రాన్సులో నెత్తుటేరులు పారించడం తనకిష్టం లేదని ఒక ప్రకటన కూడా విడుదల చేశాడు. అయితే, వెళ్లేముందు తొమ్మిదేళ్ల తన మనవణ్ణి సింహాసనం

లూయీ ఫిలిప్

మీద కూర్చోబెట్టాడు. ఇక అతడే ఫ్రాన్సుకు ప్రభువు కుర్రవాడికి మెజారిటీ వచ్చేదాకా తల్లి అతడి తరఫున పరిపాలిస్తుంది. కాని ఇలాంటి ప్రహసనాలకది సమయం కాదు. కుర్రవాడూ, తల్లి కూడా పలాయనం చిత్తగించారు. తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది.

"ఈ తిరుగుబాటు రాజకీయపరమైంది కాదు. ఆకలి బాధలే దీనికి ప్రేరణ. కేవలం ప్రభుత్వాలు మారటంతో ఈ సమస్యలు తీరవు. క్రమంగా చట్టాలు మారతాయి. సమాజ స్వరూపమే మారుతుంది. అధికారాన్ని నిలబెట్టుకోలేని వాళ్ల దాన్ని వదులుకోక తప్పదు" అన్నాడు ప్రముఖ ఫ్రెంచి చరిత్రకారుడు, రాజకీయ చతురుడు అలెక్స్ డియకులిల్.

ఈ కొత్త ఫ్రెంచి ప్రభుత్వాన్ని అమెరికా వెంటనే గుర్తించింది. 1830 నాటి ఫ్రెంచి విప్లవంలో అధికారం చేపట్టిన లూయీ ఫిలిప్ ఇప్పటి విప్లవంలో దేశం వదిలి పారిపోయాడు.

పారిస్ విప్లవ వార్తలు బ్రసెల్స్ చేరటానికి వారం రోజుల ముందే అనూహ్య పరిణామాలేవో జరగబోతున్న హెచ్చరికలు వచ్చాయి. ఏం జరిగినా సిద్ధంగా ఉండాలన్నారు మిత్రులు. దేశం వదిలి వెళ్లటానికి బదులు ప్రస్తుతముంటున్న ఇంటి నుండి బోర్డింగ్ హౌజ్‌కు మారాడు మార్క్స్.

జనవరి 29నాడు, పారిస్‌లో ఎంగెల్స్ లేని సమయంలో అతని అపార్ట్‌మెంట్‌లోకి బలవంతంగా ప్రవేశించిన ఫ్రెంచి పోలీసులు అతణ్ణి ఇరువై నాలుగు గంటల్లోగా ఫ్రాన్సు విడిచి వెళ్లాలన్నారు. లేని పక్షంలో బహిష్కరణ శిక్ష విధించి ప్రష్యాకు పంపిస్తారు.

పారిస్ విప్లవంతో మార్క్స్ ఇంట్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. మార్క్స్, అతని స్నేహితులు అనేక వేల మందితో ఒక ప్రదర్శన...డెమానుస్ట్రేషన్‌కు పిలుపునిచ్చారు. సన్నాహాలు చురుగ్గా జరిగాయి.

ఆ రాత్రి ప్రదర్శనకు జనం బాగానే తరలివచ్చారు. 'మార్క్స్' గీతాలు ఆలపించారు. 'ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి ' అంటూ నినాదాలు చేశారు. సివిల్ పోలీసులు, ప్రదర్శనలను అదుపు చెయ్యడానికి ప్రయత్నించారు. జనంలో అలజడి ప్రారంభమైంది. "స్వేచ్ఛ, సమానత్వం" అన్న నినాదాలు మిన్నంటాయి. అంతలో పోలీసులు

విరుచుకు పడ్డారు. కనిపించిన వాడినల్లా కిందపడేసి చావబాదారు. పారిపోతున్న వాళ్లను పట్టుకొని కసిదీరా కొట్టారు.

స్వదేశంలో అప్రతిష్టపాలైన జర్మనులే శనివారం రాత్రి జరిగిన హింసాకాండకు బాధ్యులని వదంతులు వ్యాపించాయి. (ఇలా వ్యాపింప చేయడం వెనుక, బెల్జియన్ రాజు లియొపాల్డ్ కుట్ర దాగి ఉంది)

"ఒక్క రోజులో బెల్జియన్ మధ్య తగాదాలు ప్రజలకు జర్మనులు శత్రువులుగా మారిపోయారు" అంటారు ఎంగెల్స్. పోలీసులు, సైన్యం, సివిల్‌గార్డ్ అందరూ జర్మన్‌లకు వ్యతిరేకం. జర్మన్‌లు ఆత్మరక్షణ కోసం ఆయుధాలు ధరించక తప్పలేదు. ఇందుకు గాను కార్ల్ ఆర్థిక సహాయం చేశాడు. (ఇంట్లో వారే వారసత్వంలో భాగంగా ఆయనకు కొంత డచ్చిచ్చారు అని రాసుకుంది జెన్నీ తన ఆత్మకథలో).

ఫిబ్రవరిలో, తల్లి ఆయనకు 6,000ఫ్రాంకులు పంపింది. ఇది తప్ప మార్క్స్ దంపతులకు వేరే ఆదాయం లేదు. తీర్చవలసిన అప్పుల చిట్టా పెద్దది. కాని స్వంత డబ్బులు ఖర్చుపెట్టాల్సివచ్చినప్పుడు మార్క్స్ భవిష్యత్తు అవసరాల గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. ఒక నిమిషంలో అతని చేతిలో వున్న డబ్బు మరుక్షణం మాయమవుతుంది. అనేక సార్లు డబ్బు వస్తుందనే ఆశతో ముందే ఖర్చులు చేస్తాడు. ఆరువేల ఫ్రాంకుల్ని ఇలా నీళ్లలా ఖర్చుపెట్టడమంటే ఏమిటో జెన్నీకి తెలుసు. ఇక రేపట్నించి మళ్లీ అప్పుల వాళ్ల అభద్రత. అయినా మార్క్స్ ఆ డబ్బులు కుటుంబానికి ఆహారంకోసం కాక, ఆయుధాల మీద ఖర్చుపెట్టినప్పుడు అభ్యంతరం చెప్పలేదు. ఇప్పటి దాకా సైద్ధాంతిక చర్చలకే పరిమితమైన మార్క్స్, ఇప్పుడు ఆచరణ వైపు అడుగువేశాడని ఆమె గుర్తించి ఉండదు.

మార్చి 1నాడు అప్పటికే అరెస్టయిన లూపస్ (విల్హెల్మ్ వూల్ఫ్, మార్క్స్‌కు అత్యంత సన్నిహితుడు), ఇతర జర్మన్‌లనూ బలవంతంగా ఫ్రాన్సుకు పంపించేశారు పోలీసులు. మార్క్స్‌కు కూడా ఇక ఎక్కువ సమయం లేదు. అతడు 2,100 ఫ్రాంకుల కరెన్సీ నోట్లు మారుస్తుండగా, ఒక గూఢాచారి గమనించాడు. అతడు ఈ డబ్బుతో తిరిగుబాటుదారులకు ఆయుధాలు కొంటున్నట్టు రుజువైతే శిక్ష ఖాయం. పిల్లల్ని తీసుకొని ట్రేయర్‌కు వెళ్లమని జెన్నీకి చెప్పాడు గాని ఆమె అంగీకరించలేదు. (ట్రేయర్‌లో "మార్క్స్ తల్లి"ని కూడా కొడుక్కి పంపిన డుబ్బు గురించి అధికారులు ప్రశ్నించి, ఆ డబ్బు కుటుంబావసరాలకోసమే అని ఒక అఫిడవిట్ తీసుకున్నారు)

పారిస్‌కు దగ్గరగా ఉండాలని, కమ్యూనిస్ట్ కేంద్ర కార్యాలయాన్ని లండన్ నుండి బ్రసెల్స్‌కు మార్చారు. కాని మారిన పరిస్థితుల్లో అది పారిస్‌కు మారాలని సూచించాడు మార్క్స్. బహుశా తనుకూడా అక్కడికి వెళ్లాలని అప్పటికే నిశ్చయించుకొని ఉంటాడు. పారిస్ ప్రతిపక్షపత్రిక సంపాదకుడొకడు ఇప్పుడు తాత్కాలిక ప్రభుత్వంలో ఉన్నాడు. ఈ కొత్త 'అధికారిక' హోదాలో తన పాత మిత్రుడు మార్క్స్‌ని ఫ్రాన్స్‌కు తిరిగి రమ్మని ఆహ్వానించాడు. ఒక నియంత నిన్ను బహిష్కరించాడు. ఇప్పుడు మహోన్నత ఆశయాల కోసం కృషిచేస్తున్న నిన్నూ ఇతర ఉద్యమకారుల్నీ ఫ్రాన్సు రెండు చేతులా ఆహ్వానిస్తున్నది". సరైన సమయంలో మార్క్స్‌కు చేరిందీ ఆహ్వానం. మార్చి2 నాడు, మార్క్స్‌ను బహిష్కరిస్తూ లియోపాల్డ్ ఆదేశాలు జారీచేశాడు.

మార్చి3 నాడు బహిష్కరణ ఉత్తర్వులు మార్క్స్‌కు అందాయి. ఇరవైనాలుగంటల్లో దేశం విడిచి వెళ్లిపోవాలి. (ఈ భాష మార్క్స్‌కు అప్పటికే సుపరిచితం) అప్పటికి మూడేళ్లుగా బ్రసెల్స్‌లో ఉంటున్నారు. జెన్నీ, లెంచెన్ సామాను సర్దటంలో నిమగ్నమై ఉన్నప్పుడు, రెండవ అంతస్తులో ఉన్న గదిలో అయిదుగురు కమ్యూనిస్టు లీగ్ సభ్యులతో సమావేశం జరిపాడు మార్క్స్. లీగ్ కేంద్రకార్యాలయాన్ని పారిస్ మార్చటానికి, కొత్త పాలకమండలిని ఏర్పాటు చేయటానికి మార్క్స్‌కు అధికారమిస్తూ అంగీకారం కుదిరింది.

బోర్డింగ్ హౌస్ మీద పోలీసుల నిఘాకొనసాగింది. రాత్రి తొమ్మిది, పదకొండు గంటల మధ్య అనేక మంది వ్యక్తులు వచ్చివెళ్లారని గ్రహించారు. అర్ధరాత్రి ఒంటిగంటకు రెయిడ్‌చేసి, మార్క్స్‌ను ధృవీకరణ పత్రాలు చూపించమన్నారు. ఫ్రాన్సు, బెల్జియంలు జారీచేసిన బహిష్కరణ ఉత్తర్వులు చూపించాడు మార్క్స్. కానీ పాస్‌పోర్ట్ లేదా ఇతర డాక్యుమెంట్లు లభించకపోవడంతో అరెస్టు చేసి పోలీసు వాహనంలోకి ఎక్కించారు.

జెన్నీకి ఎటూ పాలుపోలేదు. అరెస్టయిన జర్మన్‌ల పట్ల అధికారులు ఎలా ప్రవర్తిస్తున్నారో చూస్తూనే ఉంది. ఆయుధాలకు ఆర్థిక సహాయం చేశాడని నిరూపితమైతే దేశద్రోహ నేరం

" జెన్నీని అరెస్టుచేసి ముగ్గురు వేశ్యలున్న ఒక చీకటి సెల్‌లో నిర్బంధించారు తెల్లవారి ఉదయం, తన సెల్ నుండి మిలటరీ ఎస్కార్ట్‌తో మార్క్స్‌ను మరోచోటికి తరలించడం గమనించింది జెన్నీ. అవే చివరి చూపులా ? చంపేస్తారా ? ఆందోళనతో మరో గంట గడిచింది. ఆ తర్వాత మేజిస్ట్రేట్ ముందామెను ప్రవేశపెట్టారు. "

లియోపాల్డ్

మోపవచ్చు. తమ బెల్జియన్ లాయర్ని ఎలాగైనా కార్ల్‌ను విడుదల చేయించమని అర్థించింది. ఆ తర్వాత ఆ అర్ధరాత్రి చీకటి వీధుల్లో ఒంటరిగా ఇంటింటికీ తిరిగి మిత్రులను సహాయం చెయ్యమని కోరింది. చివరికి ఒక పోలీస్ సార్జెంట్ ఆమెను భర్త వద్దకు తీసుకెళతానన్నాడు.

లీగ్ సభ్యుడు ఫిలిప్ గిగో వెంట వచ్చాడు. తీరా పోలీస్ స్టేషన్‌కు వెళితే మార్క్స్ అక్కడ లేడు. పైగా లాయర్ సాయం ఎందుకు తీసుకున్నావని ఆమెను ప్రశ్నించారు. తన ధృవీకరణ పత్రాలు చూపించమన్నారు. పోలీసుల వైఖరిపట్ల నిరసన తెలిపిన గిగోను సెల్‌లో వేశారు. జెన్నీని అరెస్టుచేసి ముగ్గురు వేశ్యలున్న ఒక చీకటి సెల్‌లో నిర్బంధించారు

తెల్లవారి ఉదయం, తన సెల్ నుండి మిలటరీ ఎస్కార్ట్‌తో మార్క్స్‌ను మరోచోటికి తరలించడం గమనించింది జెన్నీ. అవే చివరి చూపులా ? చంపేస్తారా ? ఆందోళనతో మరో గంట గడిచింది. ఆ తర్వాత మేజిస్ట్రేట్ ముందామెను ప్రవేశపెట్టారు. అయితే ఎంత ప్రశ్నించినా,మార్క్స్ కార్యకలాపాల గురించి ఏమీ రాబట్టలేకపోయాడు మేజిస్ట్రేటు.

చివరికి, మధ్యాహ్నం మూడింటికి అంటే బహిష్కరణకు గడువు ముగుస్తుందనగా దంపతులిద్దర్నీ విడుదల చేశారు. (క్రితం రాత్రి సెల్‌లో ఒక ఉన్మాదితో కలసి ఉన్నానన్నాడు మార్క్స్). ఉన్న వస్తువులన్నీ అమ్ముకొని తన అతివిలువైన సిల్వర్‌ప్లేట్‌ను పుస్తకాల వ్యాపారి వాగ్లర్ వద్ద వదిలి బయల్దేరింది జెన్నీ.

వీడ్కోలు చెప్పటానికి పలువురు మిత్రులు కదలివచ్చారు. ఇప్పటికి జెన్నీ ఎన్ని ఇళ్లు మారిందో! పెళ్లయిన తర్వాత ఇంత వరకు ఆమెకు సొంత ఇల్లంటూ లేదు.

మార్చి4 నాడు మార్క్స్, జెన్నీ, లెంచెన్ ముగ్గురు పిల్లల్తో బ్రసెల్స్ నుండి పారిస్‌కు బయల్దేరారు. "విప్లవ సూర్యుడు ఉదయిస్తున్నాడక్కడ" మేమక్కడికి వెళ్లక తప్పదు అంటూ ఆరోజుల్ని గుర్తుచేసుకుంది జెన్నీ.

సశేషం

ఫోన్: 91776 18708

భలే భలే... బజ్జీలు

క్యాప్సికంతో కమ్మగా

కావల్సినవి:

చిన్న పరిమాణంలో ఉండే క్యాప్సికం– పావు కేజీ : సెనగపిండి– రెండు వందల గ్రా; బియ్యం పిండి– యాభైగ్రా; వాము– పావుచెంచా; ఉప్పు–తగినంత; కొబ్బరితురుము – అరకప్పు; వేయించి పొడిచేసిన నూపిండి– పావుకప్పు: కొత్తిమీర– కట్ట(తరగాలి); పచ్చి బఠాణీలు– అరకప్పు; నిమ్మకాయ– ఒకటి; వంటసోడా– పావు చెంచా; నూనె– వేయించడానికి సరిపడా.

తయారీ:

కొబ్బరితురుములో నూపిండి, తగినంత ఉప్పు కొత్తిమీర తరుగు , నిమ్మరసం , పచ్చిబఠాణీలు వేసి బాగా కలపాలి. ఇప్పుడు పైభాగం తొలగించిన క్యాప్సికం ముక్కలో ఈ మిశ్రమాన్ని కూరాలి. సెనగపిండి, బియ్యం పిండి, వాము, తగినంత ఉప్పు, వంట సోడా తీసుకుని గరిటె జారుగా కలపాలి. సిద్ధం చేసుకున్న క్యాప్సికం ముక్కల్ని పిండిలో ముంచి కాగుతున్న నూనెలో వేయించాలి. కమ్మని క్యాప్సికం బజ్జీలు నోరూరిస్తాయి. నేరుగానే తినేయవచ్చు.

కాకర కరకర

కావల్సినవి:

కాకరకాయలు– పావు కేజీ; మజ్జిగ– కప్పు; పసుపు –అరచెంచా; ఉప్పు– తగినంత ;ఉల్లిపాయలు– రెండు (మెత్తగా రుబ్బుకోవాలి); అల్లంవెల్లుల్లి ముద్ద– చెంచా చొప్పున; సెనగపిండి – కప్పు; కారం – రెండు చెంచాలు; నూనె– వేయించడానికి సరిపడా.

తయారీ:

కాకరకాయల్ని రెండు ముక్కలుగా తరిగి .. మధ్యలో కొద్దిగా గాటు పెట్టాలి. బాణలిలో మజ్జిగ, పసుపు తీసుకుని కాకర ముక్కల్ని వేసి ఉడికించి పెట్టుకోవాలి. ఇప్పుడు ఓ గిన్నెలో ఉల్లిపాయ మిశ్రమం , అల్లంవెల్లుల్లి ముద్ద, చెంచా సెనగపిండి, కారం, తగినంత ఉప్పు తీసుకుని అన్నింటినీ గట్టి పిండిలా కలపాలి. ఈ మిశ్రమాన్ని కాకరకాయ ముక్కల్లో కూరాలి. మిగిలిన సెనగపిండిని బజ్జీల పిండిలా గరిటెజారుగా కలపాలి. అవసరమనుకుంటే కొద్దిగా ఉప్పు వేసుకోవచ్చు , సిద్ధం చేసుకున్న కాకర ముక్కల్ని ఇందులో ముంచి... కాగుతున్న నూనెలో వేయించాలి. బంగారువర్ణంలోకి వచ్చాక దింపేస్తే సరిపోతుంది. కాకర బజ్జీలు చాలా రుచిగా ఉంటాయి.

నోరూరించే నవరతన్

కావాల్సినవి : పాలకూర, తోటకూర, మెంతికూర, చుక్కకూర, బచ్చలకూర, పుదీనా, కొత్తిమీర, కరివేపాకు, ఉల్లికాడలు (కాడలు మాత్రమే తీసుకోవాలి) – ఒక్కోటి కట్ట చొప్పున; మొక్కజొన్నపిండి, మైదా, బియ్యం పిండి – అరకప్పు చొప్పున; సెనగ పిండి– ఒకటిన్నర కప్పు;ఉల్లిపాయలు–రెండు(ముక్కలుగా తరగాలి);అల్లంవెల్లుల్లి ముద్ద– చెంచా;ఉప్పు, కారం – రుచికి తగినంత;వాము, జీలకర్ర– రెండు చెంచాల చొప్పున; నూనె – వేయించడానికి సరిపడా; వంటసోడా–చిటికెడు.

తయారీ : బాణలిలో మూడు చెంచాల నూనె వేసి.. ఆకుకూరలన్నింటినీ పచ్చివాసన పోయేదాకా వేయించాలి. ఇందులో అరకప్పు సెనగపిండి, మైదా, బియ్యంపిండి, మొక్కజొన్నపిండి, అల్లంవెల్లుల్లిముద్ద, ఉల్లిపాయముక్కలు, తగినంత ఉప్పు, కారం, చెంచా చొప్పున జీలకర్ర, వాము వేసుకుని బాగా కలపాలి. గట్టిపిండిలా తయారైన ఈ మిశ్రమాన్ని బుల్లెట్లలా పొడుగ్గా చేసుకోవాలి. ఇప్పుడు మరో గిన్నెలో కప్పు సెనగపిండి, మరికాస్త ఉప్పు, కొద్దిగా కారం, మిగిలిన వాము, జీలకర్ర, వంటసోడా తీసుకుని బజ్జీల పిండిలా గరిటెజారుగా కలపాలి. బాణలిలో నూనె వేడి చేసి...ముందుగా సిద్ధం చేసుకున్న ఆకు కూరల బుల్లెట్లను ఈ పిండిలో ముంచి కాగుతున్న నూనెలో వేయించాలి. బంగారు వర్ణంలోకి వచ్చాక తీసేస్తే సరిపోతుంది. తొమ్మిదిరకాల ఆకులతో చేసిన నవరతన్ బజ్జీలు టమాటాసాస్‌తో కలిపి తింటే చాలా రుచిగా ఉంటాయి.

పసందైన ఉల్లి మిర్చీ

కావల్సినవి:

పెద్ద పచ్చిమిర్చి– పావు కేజీ; వాము– చెంచా; నిమ్మకాయ – ఒకటి; చాట్ మసాలా– రెండు చెంచాలు; వంటసోడా– పావు చెంచా; ఉప్పు–తగినంత ; నూనె– వేయించడానికి సరిపడా; ఉల్లిపాయలు–200 గ్రా(సన్నగాతరగాలి); సెనగపిండి– పావు కేజీ; కొత్తిమీర తరుగు– కొద్దిగా

తయారీ :

సెనగపిండిలో వాము, తగినంత ఉప్పు, వంటసోడా కలిపి బజ్జీలపిండిలా కలిపి పెట్టుకోవాలి. ఇప్పుడు ఉల్లిపాయ తరుగులో తగినంత ఉప్పు, చాట్‌మసాలా, నిమ్మరసం , కొత్తిమీర తరుగు కలిపి గింజలు తీసి గాటు పెట్టిన మిర్చీల్లో కూరాలి. ఇలా చేసుకున్న వాటన్నింటినీ ముందుగా కలిపి పెట్టుకున్న సెనగపిండి మిశ్రమంలో ముంచి, కాగుతున్న నూనెలో వేయించాలి.

వెతికి పట్టుకోండి



red	d	e	v	o	l	g
ham	r	e	d	p	h	k
coat	q	c	h	z	j	c
glove	p	o	a	a	f	o
block	v	a	m	m	n	l
fox	q	t	f	o	x	b

బాక్సులో బోలెడన్ని అక్షరాలున్నాయా!
వాటిలో ఆరు పదాలు దాక్కున్నాయి. అవేంటంటే...
బాక్సు పక్కనే బొమ్మలతో సహా వున్నాయి కదా.
మరి వాటిని చిటికెలో గుర్తించి సున్నా చుట్టేయండి.

మమ్మీ లోపలికి దారేది



చుక్కల్లో చిక్కినదెవరోచ్



చుక్కల మధ్యలో ఎవరో చిక్కుకున్నారు.
ఎవరనేది తెలియాలంటే... చుక్కలు కలిపేయండి.

ఏం ఆడుతున్నారు?



ఈ ఐదుగురు చిన్నారులు ఐదు ఆటలు ఆడుతున్నారు. అవేంటో చెప్పకోండి చూద్దాం.

జవాబు: ఆర్చరీ , స్కిప్పింగ్, బోటింగ్, స్కేటింగ్, సర్ఫింగ్

ఎన్ని ఇటుకలు కావాలి?



మేస్త్రీ కట్టే గోడ ఇంకా పూర్తి కాలేదు. అది మొత్తం అవ్వాలంటే...
ఎన్ని ఇటుకలు కావాలో చెప్పండి.

జవాబు: 21

రంగులు అద్దేద్దాం



ఇక్కడ కొన్ని సముద్ర జీవులు వున్నాయి. వాటికి రంగులేయాలి. అయితే మేం చెప్పినవే వేయాలి. అలా వేయాలంటే... మీకు లెక్కలు బాగా రావాలి. బొమ్మల్లో ఇచ్చిన గుర్తుల ప్రకారం లెక్కలు చేశాక... మేం చెప్పిన రంగులు అద్దండే.

పాప బొమ్మలేవబ్బా...

ఆ పాప పేరు టింకూ. తన కప్పు, గరిట, బొమ్మ ఏనుగు ఇక్కడే ఎక్కడో వున్నాయి. వాటిని గుర్తించి సున్నా చుట్టండే.

ఆ పది పేర్లు చెప్పుకోండి

ఇక్కడ నడుము మీద చేతులు పెట్టుకుని నిలబడ్డాడే ఆ చిన్నారే చింటు. వాడి చుట్టూ పది జంతువులున్నాయి. అవి ఏంటో చెప్పుకోండి చూద్దాం.

ఎలుకలు ఎన్ని?

ఆర్టిస్టు అంకుల్ ఓ బొమ్మ వేశాడు. ఇందులో బోలెడన్ని ఎలుకలున్నాయి. అవి ఎన్నో లెక్కించి చెప్పండి.

సాలీడు బొమ్మ వేద్దామా

◆ సమ్‌థింగ్ స్పెషల్

పేరుకే క్లీన్ ఎనర్జీ ఆచరణలో కాలుష్యమే

గొర్రెల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను తోడేళ్ల పెంపకానికి కేటాయిస్తే ఏమౌతుందో వాతావరణం, పర్యావరణాన్ని కాపాడేందుకు ఉద్దేశించిన నిధులను వాటిని దెబ్బతీసే ప్రాజెక్టులకు కేటాయిస్తే అదే జరుగుతుంది. శుక్ర, శని, ఆదివారాలలో తమ పాపాలను క్షమించమని వేడుకొని మరుసటి రోజు నుంచి అదే చేస్తే ఎవరేం చేయగలరు? ఇటీవల లాటిన్ అమెరికాలోని పెరూలో వాతావరణ మార్పుల గురించి అంతర్జాతీయ సదస్సు జరిగిన విషయం తెలిసిందే. ఇటీవలి సంవత్సరాలలో ప్రతి ఏటా ఎక్కడో ఒకచోట దీని గురించి తీవ్ర చర్చలు జరపటం, వందల కోట్ల డాలర్లు కేటాయిస్తామని భీకర ప్రతిజ్ఞలు చేయటం, సదస్సు ప్రాంగణాలు దాటగానే వాటిని మరిచిపోవటం చూస్తున్నాం. వాగ్దానం ప్రకారం నిజంగా కేటాయిస్తున్నారా, ఖర్చు చేస్తున్నారా అని తనిఖీ లేదా పర్యవేక్షణకు ఎలాంటి యంత్రాంగం లేకపోవటమే దీనికి కారణం.

వాతావరణం, పర్యావరణ పరిరక్షణకు ఐక్యరాజ్యసమితి రూపొందించిన నిబంధనలను పెద్ద దేశాలే ఉల్లంఘిస్తున్నట్లు పెరూ సమావేశం సందర్భంగా వెల్లడైంది. రాబోయే రోజుల్లో నిర్మించబోయే వన్నీ హరిత ప్రాజెక్టులుగా ఉండాలని, వాటికి ప్రోత్సాహకాలివ్వాలన్నది నిబంధనల సారాంశం. ప్రపంచ ఇంధన వ్యవస్థలో కర్బన వాయువుల విడుదల పెద్ద కాలుష్య సమస్య. దీనికి కారణం ప్రధాన వనరు బొగ్గు. అనేక దేశాలలో బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని నిరుత్సాహపరుస్తున్నారు. ఇటువంటి స్థితిలో వాతావరణ పరిరక్షణకు ఖర్చు చేయాల్సిన వందకోట్ల డాలర్లను బొగ్గు ఆధారిత విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి మళ్లించిన విషయం పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న వారిని విస్మయపరిచింది. దళితుల సంక్షేమానికి ఖర్చు చేయాల్సిన నిధులను హైదరాబాదులో పార్కులు, ఫ్లైఓవర్ల నిర్మాణానికి కేటాయించిన ఘనుల గురించి ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకోవాలి. అదేమంటే దళితులు పార్కుల్లో కూర్చోరా, ఫ్లైవోవర్ల మీద తిరగరా అంటూ తెలివిగా మాట్లాడిన వారున్నారు. మన అధికార యంత్రాంగం ప్రజల దరఖాస్తులను తిరస్కరించి వాటిని కూడా పరిష్కరించినట్లు చూపుతారు. అలాగే అసలు వాతావరణ నిధులంటే ఏమిటో సరైన నిర్వచనం లేకపోవటాన్ని ఆసరా చేసుకొని వాటిని దుర్వినియోగం చేస్తున్నారు.

ఇండోనేషియాలో మూడు బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి జపాన్ తన వాతావరణ నిధుల నుంచి వంద కోట్ల డాలర్ల మేర కేటాయించినట్లు ఒక వార్తా సంస్థ లిమా సమావేశాల సందర్భంగా వెల్లడించింది. ఎందుకిచ్చారంటే ఇండోనేషియా వంటి దేశాలు ఇంతకు మించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించలేవని, పాత కేంద్రాలతో పోల్చితే కొత్త వాటిలో మరింత సమర్ధవంతంగా బొగ్గును వినియోగిస్తున్నందుకు గాను వాటిని అందచేసినట్లు జపాన్ సమర్ధించుకుంది. అయితే సహజవాయువుతో నడిచే విద్యుత్ కేంద్రాలతో పోల్చితే ఈ 'సమర్ధ థర్మల్ కేంద్రాలు' రెండు రెట్లు అదనంగా కర్బన వాయువును విడుదల చేస్తాయన్నది అసలు నిజం. ఒక కేంద్రం సమీపంలోని సముద్ర నీటిలో చేపలు,రొయ్యలు తగ్గిపోతున్నాయని ఇండోనేషియా గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గతంలో రోజుకు 50 పీతలు దొరికే చోట ఇప్పుడు పదికి పడిపోయాయని వాపోయారు. థర్మల్ కేంద్రాల నుంచి వెలువడే బురద రూపంలో ఉండే బూడిదను సముద్రంలోకి వదులుతుండటమే దీనికి కారణమని చెబుతున్నారు.

ఇండోనేషియా థర్మల్ కేంద్రాలకు వాతావరణ నిధులు ఇచ్చినట్లు తమకు తెలియదని, అయినా అలాంటి వాటిని సమర్ధించేది లేదని ఐరాస వాతావరణ విభాగ అధిపతి క్రిస్టినా ఫిగర్స్ చెప్పారు. ఇటీవలే 'హరిత వాతావరణ నిధి'ని ప్రారంభించారు. దీని కథా అదే. నిర్వచనం సరిగా లేదు గనుక ఎలా ఖర్చు చేయాలో ఇంతవరకు తెలియదు.కాలుష్య కారక పథకాలకు ఈ నిధి నుంచి కేటాయింపులు జరపవద్దని ఇప్పటికే అనేక స్వచ్ఛంద సంస్థలు కోరాయి. నిజానికి ఒక్క జపాన్ మాత్రమే గాక అమెరికా, జర్మనీ వంటి అనేక ధనిక దేశాలు ఏదో ఒకసాకుతో వర్ధమాన దేశాలలో ఇలాంటి పథకాలకు నిధులు అందచేస్తున్నాయి. అయితే అవి వాటిని వాతావరణ నిధులుగా అవి చెప్పుకోవటం లేదు. ఇండోనేషియాలో జపాన్ సాయంతో నిర్మితమైన మూడు కేంద్రాలు 2009లో కోపెన్‌హాగన్ వాతావరణ సదస్సు సందర్భంగా వాటిని వాతావరణ పరిరక్షక కేంద్రాలుగా చిత్రించి ప్రచారం చేశారు. ఆ సమావేశంలోనే 2012 నాటికి వాతావరణ నిధికి ధనిక దేశాలు 3000 కోట్ల డాలర్లను వాగ్దానం చేశాయి. దీనిలో సగం తానే ఇస్తానని జపాన్ పేర్కొన్నది. ఈ నిధిని 2020 నాటికి పదివేల కోట్లకు పెంచుతామని ధనిక దేశాలు వాగ్దానం చేశాయి.

జపాన్ గొప్పగా చెప్పుకుంటున్న 'క్లీన్ కోల్' సాంకేతిక పరిజ్ఞానం గురించి వాతావరణ శాస్త్రవేత్తలు అనేక సందేహాలను లేవనెత్తుతున్నారు. వాతావరణ చర్చలలో ఐక్యరాజ్యసమితి లేవనెత్తిన స్థాయికి ఉష్ణోగ్రతలను తగ్గించటంలో ఆ పరిజ్ఞానం లక్ష్యాన్ని సాధించలేదని స్పష్టం చేస్తున్నారు. బొగ్గు నుంచి విడుదలయ్యే కార్బన్ వాయువును పీల్చి దానిని భూమిలో నిక్షిప్తం చేసే పరిజ్ఞానం తప్ప మరొకటేదీ పనిచేయజాలదని పేర్కొంటున్నారు. అయితే ఈ పరిజ్ఞానం అమలులోకి తేవాలంటే ప్రస్తుతం ఎంతో స్థలం, డబ్బు కావాలని, వాణిజ్యపరంగా లాభదాయకం కాదని కూడా చెబుతున్నారు.

2011-12లో వాతావరణ నిధి 650 బిలియన్ డాలర్లు చలామణిలో ఉన్నట్లు అంచనా. అభివృద్ధి చెందిన దేశాల నుంచి 35నుంచి 50 బిలియన్ డాలర్లు వస్తోంది. దీనిలో 80శాతం స్థానికంగానే సమకూర్చుకుంటున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 71శాతం జాతీయ వనరుల నుంచి వస్తున్నాయి. ఇలాంటి నిధులలో 95శాతం కాలుష్య వాయువులను తగ్గించేందుకు మాత్రమే ఖర్చుచేస్తున్నారు. కేవలం ఐదుశాతమే మార్పిడి అవసరాలకు కేటాయిస్తున్నారు.

ప్రస్తుతం 'హరిత వాతావరణ నిధి(జిసిఎఫ్) 970 కోట్ల డాలర్లకు చేరింది. 2015లో దీనిని ఖర్చు చేయనున్నారు. ప్రస్తుతం ప్రపంచంలో 107 దేశాలలో 130 బిలియన్ డాలర్లతో 7,800 ప్రాజెక్టులు అమలులో ఉన్నాయి.

- సత్య

పైసా లేకుండా ప్రపంచ యాత్ర చేసిన మిత్రులు

మిలాన్ భిల్‌మాన్, మొమర్ ఇల్మాజ్ ఇద్దరూ మంచి స్నేహితులు. వాళ్లకు దేశదేశాలన్నీ తిరిగి చూడాలని కోరిక. కాని చేతిలో పైసలు లేవు. అలాగని ఆగిపోలేదు. 80 రోజుల్లో ప్రపంచం చుట్టి వచ్చారు. అదీ ...పైసా ఖర్చు లేకుండానే. ఎలా అంటారా .... వివిధ ట్రావెల్ కంపెనీలను కలసి ప్రపంచాన్ని చుట్టి రావాలన్న తమ కోరికను తెలియచేశారు. కనికరించిన ట్రావెల్స్ కంపెనీల వారు ఈ అపూర్వ మిత్రుల కోరికను తీర్చేందుకు ముందుకొచ్చారు. దాంతో వీరు ఆస్ట్రియా, హంగేరీ, టర్కీ బల్గేరియా, ఇరాన్, ఇండియా, పాకిస్థాన్, అమెరికా, సింగపూర్ దేశాలన్నీ చుట్టేశారు. ఇక తిండి తిప్పలంటారా మార్గ మధ్యలో ఎవరు ఏం పెడితే అదే ఆ పూట విందు భోజనం. ఎవరెక్కడ ఆశ్రయం కల్పిస్తే అక్కడ విశ్రాంతి తీసుకోవడం. మొత్తం మీద జేబులో చిల్లి గవ్వ లేకపోయినా ప్రపంచ యాత్ర చేసొచ్చారు ఈ ఇద్దరు మిత్రులు. ●

అమ్మాయా... మైనపు బొమ్మాయా!



ఆశ్చర్యపోమాకండి ! స్ప్రింగులా శరీరాన్ని వంచింది ఓ అమ్మాయే ! బొమ్మ ఏ మాత్రం కాదు.
ఈమె పేరు జూలియా. రష్యాలో పుట్టినా ప్రస్తుత నివాసం మాత్రం జర్మనీలోనే.
తను నాలుగేళ్ల ప్రాయం నుంచే ఇలా మేనితో మేజిక్కులు చేయడం మొదలు పెట్టింది.
చూపరులకు మతి పోగొట్టేది. నిమిషాల్లో వంటిని వంచేసేది.
అప్పటి నుండి ఇప్పటికి ఎన్నేసి ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టిందనీ...!
అందుకు ఈ ఫోటోల్లో తను పెట్టిన పోజులే సాక్ష్యాలు.
అన్నట్టు... జూలియాను చూసిన ఆవేశంలో ఎవరైనా ఇలా చేయాలని ప్రయత్నిస్తే మాత్రం
ఇబ్బందులు తప్పవు. అందుకే చూసి ఆనందించడం వరకే పరిమితమైపోదాం. •